RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | గురువారం, జూన్ 4, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 45 | పేజీలు: 8 | వెల : రూ.1



9 జిల్లాల్లో మహిళా శక్తి బజార్లు



## రాష్ట్రంలో సవరించిన భూముల మార్కెట్ విలువలు జూన్ 5, నుంచి అమలు

**::: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

హైద్రాబాద్ జూన్ 3 : రాష్ట్రంలో సవరించిన భూముల మార్కెట్ విలువలు జూన్ 5, 2026 నుంచి అమలు లోకి వస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. భూముల విలువల సవరణను శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టాం క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ పరిస్థితుల విశ్లేషణ ఆధారంగా కొత్త విలువలను నిర్ణయించామని, సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు నిపుణుల సూచనలు, అధికారుల సలహాలతో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రాంతాల వారీగా మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ విలువల మధ్య వ్యత్యాసాలను పరిశీలించాం గత బీఆర్ఎస్ ప్రభుత్వం శాస్త్రీయ అధ్యయనం లేకుండా భూముల ధరలను పెంచింది 2021-22లో ఆరు నెలల వ్యవధిలో రెండు సార్లు భూముల విలువలు పెంచారు రిజిస్ట్రేషన్ ఛార్జీలను 6 శాతం నుంచి 7.5 శాతానికి పెంచింది బీఆర్ఎస్ ప్రభుత్వం గత ప్రభుత్వ సవరణలలో కొన్ని చోట్ల మార్కెట్ ధరల కంటే తక్కువ, మరికొన్ని చోట్ల అధికంగా విలువలు నిర్ణయించబడ్డాయి భూ లావాదేవీలలో ఏర్పడుతున్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పునర్విమర్శ చేపట్టాం రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల

(మిగతా 2వ పేజీలో)

# మహానగరంలో ఉండేది ఎలా?

## ఆకాశన్నంటున్న అద్దెలు



హైదరాబాద్, జూన్ 3, (వాయిస్ టుడే ) : మహానగరంలో సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలకు సొంతిల్లు కొనడం ఒక కలగానే మిగిలిపోతుండగా, కనీసం అద్దె ఇంట్లోనైనా ఉందామన్నా కిరాయిలు ఆకాశాన్ని తాకుతున్నాయి. నగరంలో ప్రతి సంవత్సరం విపరీతంగా పెరుగుతున్న అద్దెల కారణంగా మధ్యతరగతి కుటుంబాలపై మోయలేని ఆర్థిక భారం పడుతోంది. సాధారణంగా వేసవి సెలవుల సమయంలో ఇళ్లు ఎక్కువగా ఖాళీ అవుతుంటాయి. ఆ తర్వాత జూన్ నెల వచ్చేసరికి ఉద్యోగుల బదిలీలు, పిల్లలను కొత్త స్కూళ్లు, కాలేజీలలో చేర్పించడం, అలాగే ఉపాధి కోసం ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి వచ్చేవారి వలసల కారణంగా అద్దె ఇళ్లకు విపరీతమైన డిమాండ్ పెరుగుతోంది. ఈ క్రమంలోనే మణికొండ వంటి ప్రాంతాల్లో 'టులెట్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. నగరంలో భారీ అద్దెలను భరించలేక చాలామంది ప్రజలు శివార్లకు వెళ్లిపోతున్నారు.ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండే ఐటీ కారిడార్ పరిధిలో ఇళ్ల అద్దెలు మరీ ఎక్కువగా ఉన్నాయి. మణికొండ పంచవటి కాలనీలో ఒక 3 దీంఖ ఫ్లాట్ అద్దె నెలకు రూ. 40,000 నుండి రూ. 50,000 మధ్య పలుకుతుండగా, 2 దీంఖ ఫ్లాట్‌కు రూ. 25,000 నుండి రూ. 30,000 వరకు డిమాండ్ చేస్తున్నారు. వీకర్ సెక్షన్ ఏరియాల్లో సైతం అద్దెలు రూ. 18,000 నుండి రూ. 20,000 కు చేరాయి. బాచుపల్లిలోని కొత్త ఫ్లాట్లలో 2 దీంఖ కిరాయి రూ. 20,000 వరకు ఉండగా, కిస్మత్‌పూర్‌లో రూ.25,000 గా ఉంది. కేపీహెచ్‌బీ పాత ఫ్లాట్లలో సైతం రూ. 20,000 నుండి రూ. 25,000 వరకు అద్దెలు వసూలు చేస్తున్నారు. మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, తెల్లాపూర్, నల్లగండ్ల, గండిపేట వంటి ఐటీ ప్రాంతాలలోని గేటెడ్ కమ్యూనిటీలలో అద్దెలు మరింత దారుణంగా ఉన్నాయి. అక్కడ 2 దీంఖ కి రూ. 40,000 -- రూ. 50,000, అలాగే 3 దీంఖ కి రూ. 60,000 నుండి రూ. 80,000 వరకు రెంట్ వసూలు

(మిగతా 2వ పేజీలో)



## తెలంగాణ రాష్ట్రంలో 3,4,తేదీల్లో పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు

హైద్రాబాద్ జూన్ 3 : తెలంగాణ రాష్ట్రంలో ఇవాళ, రేపు పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ ప్రకటించింది. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణలో ఇవాళ రేపు ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని, గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఉరుములు, మెరుపులతో ఈదురు గాలులు : ఉమ్మడి ఆదిలాబాద్ పాటు కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, ఖమ్మం, సూర్యాపేట, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ హెచ్చరికలు జారీ చేసింది. ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్తో పాటు యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ జారీ చేసింది. ఉరుములు, మెరుపులతో ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరించింది. రేపు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ తో పాటు నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, నిజామాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు, ఉమ్మడి ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు.

# ట్రాఫిక్ చలాన్లపై బిగ్ అప్‌డేట్

## నెల రోజులే గడువు, త్వరపడండి



హైదరాబాద్, జూన్ 3 : ట్రాఫిక్ చలాన్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వాహనదారులు ఆన్‌లైన్‌లో తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని తేల్చి చెప్పింది. ఇందుకోసం నెల రోజుల గడువు ఇచ్చింది. నెల రోజుల తర్వాత వివరాలు నమోదు చేసుకోకపోయినా.. ట్రాఫిక్ చలాన్ పంపించినట్లుగానే భావిస్తామని స్పష్టం చేసింది. ట్రాఫిక్ చలాన్ల విషయంలో మరింత కఠిన వైఖరి అనుసరించడంలో భాగంగా సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది.రోడ్లపై ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వాహనదారులపై పోలీసులు చలాన్‌లు విధించి.. వారిపై కొరఢా ఝుళిపిస్తూ ఉంటారు. అయితే కొంతమంది వాహనదారులపై అనేక ట్రాఫిక్ చలాన్లు పెండింగ్‌లో ఉన్నా.. పోలీసులకు దొరకకుండా తప్పించుకుని తిరుగుతూ ఉంటారు. ఈ క్రమంలోనే కొందరు వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు దొరికినప్పుడు వారి బండి నంబర్ ఆధారంగా చెక్ చేస్తే.. వేలల్లో ట్రాఫిక్ చలాన్లు

(మిగతా 2వ పేజీలో)

# బంగారం విక్రయిస్తున్న భారత్

ముంబై, జూన్ 3, (వాయిస్‌టుడే) : పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల మన ఇంధన దిగుమతుల బిల్లు భారీగా పెరిగింది. అలాగే ఈ ఏడాది 2026 జనవరి నుంచి ఇప్పటి వరకు స్టాక్ మార్కెట్లలో రూ.2.25 లక్షల కోట్ల విలువైన ఈక్విటీలను విదేశీ మదుపరులు విక్రయించారు. తమ పెట్టుబడులను తీసుకెళ్లారు. ఈ కారణాలతో అమెరికా డాలర్‌కు గిరాకీ బాగా పెరిగింది. రూపాయి విలువ పడిపోతోంది. దీంతో మన దగ్గర ఉన్న విదేశీ మారకపు నిల్వల విలువ భారీగా పడిపోతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫారెక్స్ నిల్వలు రూ.728.49 బిలియన్ డాలర్లుగా ఉండగా అది 4 నెలల్లోనే 47 బిలియన్ డాలర్లు తగ్గిపోయి 681.40 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. వీటిని కాపాడుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 6 బిలియన్ డాలర్లు అంటే దాదాపు

(మిగతా 2వ పేజీలో)





## ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం.. 20 మంది దుర్మరణం

దేశ రాజధాని ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దక్షిణ ఢిల్లీలోని మాల్వియా నగర్ ప్రాంతంలో ఉన్న లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో బుధవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 20 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 11 మంది గాయపడ్డారు. హౌజ్ రాణి ప్రాంతంలో ఉన్న ఈ రెస్టారెంట్‌లో ఉదయం సుమారు 8.50 గంటల సమయంలో మంటలు చెలరేగినట్లు అధికారులు తెలిపారు. ఉదయం 9.45 గంటలకు అగ్నిప్రమాదంపై సమాచారం అందుకున్న ఢిల్లీ ఫైర్ సర్వీస్ వెంటనే స్పందించి అగ్నిమాపక సిబ్బంది,

(మిగతా 2వ పేజీలో)

# పెట్రోల్, గ్యాస్ కష్టాలు తీరినట్టే..




న్యూఢిల్లీ, జూన్ 3, (వాయిస్ టుడే ) : అమెరికా-ఇరాన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, హార్ముజ్ జలసంధి మూసివేత కారణంగా భారత్ ఇంధన రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ ధరలు భారీగా పెరిగి, సరఫరా కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వానికి ఊరట లభించింది.హార్ముజ్ జలసంధి ద్వారా ప్రపంచంలోని అత్యధిక చమురు, గ్యాస్ రవాణా జరుగుతుంది. ప్రస్తుత యుద్ధ పరిస్థితుల వల్ల నౌకల రవాణాలో అంతరాయం ఏర్పడటంతో భారత్‌కు ఇంధన సరఫరా దెబ్బతిన్నది. దీని ప్రభావంతో పెట్రోల్, ఎల్‌పీజీ ధరలు పెరిగాయి. సరఫరా కొరత ఏర్పడింది. పానిక్ బయింగ్ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో భారత్‌కు ప్రత్యామ్నాయ మార్గం అవసరమైంది.భారత్--ఒమన్ మధ్య కుదిరిన కాంప్రెహెన్సివ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్ (సీఈపీఏ) 2025, జూన్ నుంచి అమలులోకి వచ్చింది. ఈ ఒప్పందం ద్వారా

(మిగతా 2వ పేజీలో)



## మనిషికి ఆరోగ్యానికి మించి ఆస్తి ఉండదు

**::: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

గుంటూరు : గుంటూరుదశాబ్దాలుగా వైద్యం రంగంలో లలితా గ్రూప్ ఉంది. గుంటూరులో ఇలాంటి అత్యాధునిక ఆసుపత్రిని ప్రారంభించుకోవడం సంతోషకరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం అయన గుంటూరులో లలితా హాస్పిటల్ ను ప్రారంభించారు. చంద్రబాబు మాట్లాడుతూ సౌత్ ఇండియాలోనే మొదటి సారి ఆధునిక ఎమ్ఆర్ఐ స్కాన్ ఇక్కడికి తీసుకొచ్చారు. 1995లో నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులు, ఇతర చిన్న ఆసుపత్రులు


(మిగతా 2వ పేజీలో)

వాయిస్ ఆఫ్ ప్రజలు



# పవన్ సభను అడ్డుకోవడం సమంజసం కాదు

## అభివృద్ధిలో పోటీ పడాలి.. విద్వేషాల్లో కాదు



హైదరాబాద్, జూన్ 3 : హైదరాబాద్‌లో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణ , దాని చుట్టూ సాగుతున్న రాజకీయ వివాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం తీవ్రంగా స్పందించారు. తెలంగాణ రాజకీయాల్లో పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు నేతలు చేస్తున్న వ్యాఖ్యలను, పోలీసుల ఆంక్షలను ఆయన తప్పుబట్టారు. ప్రజాస్వామ్యంలో ఏ రాజకీయ పార్టీకైనా, ఏ నాయకుడికైనా ఎక్కడైనా పర్యటించే హక్కు ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పవన్ కల్యాణ్‌ను, జనసేన కార్యక్రమాలను అడ్డుకోవాలని చూడటం ఎంతమాత్రం కరెక్ట్ కాదని సీఎం చంద్రబాబు నాయుడు ఖరాఖండీగా చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీలు తమ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి సభలు, సమావేశాలు నిర్వహించుకోవడం సహజమని.. దాన్ని అడ్డుకోవాలని చూడటం అప్రజాస్వామికమని మండిపడ్డారు. పవన్ కల్యాణ్ సభకు ఆంక్షలు విధించడం, ఆయనను టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించడం వెనుక ఉన్న రాజకీయ ప్రయోజనాలను ప్రజలు గమనిస్తున్నారని బాబు పేర్కొన్నారుభారతదేశంలో ఉన్న ఫెడరల్ స్ఫూర్తిని గుర్తు చేస్తూ చంద్రబాబు ఈ సందర్భంగా కీలక ఉదాహరణలను లేవనెత్తారు. గతంలో తమిళనాడు ఎన్నికల సమయంలో నేను వెళ్లి అక్కడ ప్రచారం చేశాను. అలాగే కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ నేత, ప్రస్తుత సీఎం డీకే శివకుమార్ కూడా ఇతర రాష్ట్రాల్లో యాక్టివ్‌గా ప్రచారం చేశారు. మనమంతా ఒకే దేశంలో ఉన్నప్పుడు ఒక రాష్ట్ర నేత వేరే రాష్ట్రానికి వెళ్లకూడదనే నిబంధన ఎక్కడైనా ఉందా? అని చంద్రబాబు నిలదీశారు. పవన్‌ను ప్రాంతం పేరుతో టార్గెట్ చేస్తున్న వారికి ఈ వ్యాఖ్యల ద్వారా ఆయన గట్టి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ నేతలు అనుసరిస్తున్న తీరుపై చంద్రబాబు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అసలు ఎందుకు ఇలా చేస్తున్నారో నాకైతే అర్థం కావడం లేదు. రాజకీయాల్లో ఉంటే ప్రజలకు ఎవరు ఎక్కువ సేవ చేస్తారు, ఎవరు ఎంత బాగా అభివృద్ధి చేస్తారనే విషయంలో పార్టీలు పోటీ పడాలి. అంతే తప్ప, ప్రజల మధ్య లేనిపోని ప్రాంతీయ విద్వేషాలను రగిల్చి రాజకీయం చేయాలని చూడటం సరైన పద్ధతి కాదు అని హితవు పలికారు. ప్రజల మధ్య గోడలు కట్టాలని చూసే ప్రయత్నాలను నాయకులు మానుకోవాలని సూచించారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి 12 సంవత్సరాలు గడిచిపోయిన తర్వాత కూడా.. ఇంకా పాత ఆంధ్రా–తెలంగాణ సెంటిమెంట్‌ను రగిల్చే ప్రయత్నం చేయడంపై చంద్రబాబు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక స్థిరమైన రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడి, ఇరు రాష్ట్రాల మధ్య సామరస్యపూర్వక వాతావరణం నెలకొంటున్న తరుణంలో.. మళ్లీ పాత వివాదాలను తవ్వి తీయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. రాజకీయాల కోసం పాత సెంటిమెంట్ల ముసుగులోకి వెళ్లడం నాయకుల బలహీనతకు నిదర్శనమన్నారు. తెలంగాణ సమాజం అత్యంత చైతన్యవంతమైనదని, ఇక్కడ ఎవరు ఎలాంటి రాజకీయం చేస్తున్నారో ప్రజలందరికీ బాగా తెలుసని చంద్రబాబు వ్యాఖ్యానించారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఎవరి పాత్ర ఎంత ఉందో, ఉమ్మడి రాష్ట్రంలో, విభజన తర్వాత ఎవరు ఏ రకమైన సేవలందించారో ప్రజల మనసుల్లో స్పష్టంగా ఉందన్నారు. కాబట్టి ఓట్ల కోసం, పబ్లిసిటీ కోసం పవన్ కల్యాణ్ లాంటి నేతలను టార్గెట్ చేస్తూ ఇరుకైన రాజకీయాలు చేయడం ఎవరికి మంచిది కాదని చంద్రబాబు బుధవారం స్పష్టం చేశారు.

# 9 జిల్లాల్లో మహిళా శక్తి బజార్లు



ఖమ్మం, జూన్ 3, (వాయిస్ టుడే ) : తెలంగాణలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక బలోపేతమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ప్రణాళికలను అమలు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు.. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా మహిళా సూపర్ బజార్లు, లాజిస్టిక్స్ హబ్‌లు, ఆధునిక రైస్‌మిల్లులను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ వేగంగా అడుగులు వేస్తోంది. మహిళా సంఘాల ద్వారానే వీటిని సమర్థవంతంగా నిర్వహించి, వారిని వ్యాపారవేత్తలుగా మార్చాలనేది ప్రభుత్వ ప్రధాన సంకల్పంఈ బృహత్తర ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో వేగవంతం చేసేందుకు సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్ సోమవారం రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల ఉన్నతాధికారులతో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తొలి దశ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఒకేసారి కాకుండా.. ప్రాథమికంగా తొమ్మిది ఉమ్మడి జిల్లా కేంద్రాలైన హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్, సంగారెడ్డిలలో ఒక్కొక్కటి చొప్పున మహిళా శక్తి సూపర్ బజార్లను స్థాపించాలని ప్రతిపాదించారు. ప్రముఖ రిటైల్ సంస్థ డీమార్ట్ తరహాలోనే ఈ సూపర్ బజార్లలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల నిత్యావసర సరకులు, గృహోపకరణాలు, వివిధ రకాల పరికరాలను తక్కువ ధరలకే విక్రయించేలా ఖమ్మంలో మొదటి పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నారుఈ సూపర్ బజార్ల నిర్మాణానికి జనాభా సాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సుమారు 5 వేల గజాల స్థలం అవసరమని సెర్ప్ అధికారులు గుర్తించారు. అనువైన ప్రభుత్వ భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ ఆయా జిల్లాల కలెక్టర్లకు తక్షణమే లేఖలు రాయాలని నిర్ణయించారు. మరోవైపు.. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం జిల్లాలో లాజిస్టిక్స్ హబ్, రైస్‌మిల్లు ఏర్పాటుకు అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని, ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఖమ్మం జిల్లాలో భారీ గోదాం, లాజిస్టిక్స్ హబ్, రైస్ మిల్లుల స్థాపన కోసం దాదాపు 20 ఎకరాల భూమిని కేటాయించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక ప్రతిపాదనలు పంపేందుకు సెర్ప్ సిద్ధమైంది.ఈ మెగా ప్రాజెక్టుల విజయవంతమైన నిర్వహణకు గానూ.. ఆయా జిల్లాల్లో సమర్థవంతంగా పనిచేస్తున్న మహిళా సమాఖ్యలను ఎంపిక చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు సెర్ప్ ఆదేశాలు జారీ చేసింది. ఖమ్మంలో నిర్మించబోయే లాజిస్టిక్స్ హబ్, రైస్ మిల్లులకు సంబంధించి ఏ మండలంలో అయితే భూమిని ఎంపిక చేస్తారో అదే మండలానికి చెందిన మహిళా సమాఖ్యకే పూర్తి నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని అధికారులు భావిస్తున్నారు. భవిష్యత్తులో మిగిలిన జిల్లాల్లోనూ ఇదే తరహా ప్రాజెక్టులు రానున్నందున.. రాష్ట్రంలోని అన్ని మహిళా సమాఖ్యలు ఆర్థిక నిర్వహణకు, వ్యాపార బాధ్యతలకు సిద్ధంగా ఉండాలని సెర్ప్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో తెలంగాణ మహిళా లోకంలో సరికొత్త ఉపాధి విప్లవం రానుంది

## పవన్‌కళ్యాణ్‌పై గద్దర్ కూతురు వెన్నెల ఫైర్

హైదరాబాద్ : పవన్ వ్యాఖ్యలను గద్దర్ బిడ్డ వెన్నెల ఖండించారు. తెలంగాణ గడ్డ నిన్న మా అయ్యల జాగీరే...తెలంగాణ గడ్డ ఈరోజు మా జాగీరు. రేపు మా బిడ్డల జాగీరని అన్నారు. నటుడిగా, గద్దర్ అభిమానిగా పవన్ ను అభిమానిస్తారు. పైసలు పంచితేనో, లాబీలు చేస్తేనో తెలంగాణ రాలేదు... తెలంగాణ ఉద్యమం ఆత్మ గౌరవ పోరాటం. ఉద్యమంలో ప్రాణాలు తీసుకున్నాం కానీ ఎవర్ని ఒక్క మాట కూడా అనలేదు. త్యాగాలు చేసి తెలంగాణ తెచ్చుకున్నాం. తెలంగాణ అన్నందుకు చాలా మందిని ఎన్కౌంటర్ చేశారు. ఉద్యమంలో చాలా మంది తల్లులు తమ బిడ్డల్ని కోల్పోయారని అన్నారు.

## టార్గెట్ 100.. జగన నయా లెక్కలు

విజయవాడ, జూన్ 3, (వాయిస్‌టుడే) : రాజకీయాల్లో పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు మారడం సహజం. అయితే భారీ విజయాలను లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్లిన పార్టీలు అనూహ్య ఫలితాలు ఎదుర్కొన్నప్పుడు తమ కార్యాచరణను తిరిగి సమీక్షించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కూడా ఇలాంటి చర్చలే జరుగుతున్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల సమయంలో వై నాట్ 175 అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేసిన పార్టీ, ఎన్నికల ఫలితాల్లో కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితం కావడంతో భవిష్యత్ వ్యూహాలపై అంతర్గతంగా మంతనాలు ప్రారంభమైనట్లు సమాచారం.ఇటీవల నిర్వహించిన పార్టీ సమావేశాల్లో నాయకుల మధ్య కొత్త ఎన్నికల లక్ష్యాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. గతంలో అత్యంత భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం వల్ల క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని కొందరు అభిప్రాయపడ్డారు. అందువల్ల వచ్చే ఎన్నికల్లో వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పరిమిత లక్ష్యంతో ముందుకు సాగాలని సూచనలు వచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.కొంతమంది నాయకులు 175 స్థానాలపై దృష్టి కేంద్రీకరించడం కంటే, గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న సుమారు 100 నియోజకవర్గాలను గుర్తించి ప్రత్యేక వ్యూహంతో పని చేయాలని అభిప్రాయపడినట్లు సమాచారం. బలమైన స్థానాల్లో పార్టీ శక్తిని కేంద్రీకరించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని వారు వివరించినట్లు తెలుస్తోంది.అలాగే ఆయా నియోజకవర్గాల్లో స్థానిక నాయకత్వాన్ని మరింత చురుకుగా మార్చడం, కార్యకర్తలను సమన్వయం చేయడం, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం వంటి అంశాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. గత ఎన్నికల అనుభవాల ఆధారంగా బలహీనతలను గుర్తించి వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం అవసరమని నాయకులు అభిప్రాయపడ్డారని చెబుతున్నారు. పార్టీ అధ్యక్షుడు జగన్ తుది నిర్ణయం తీసుకునే వరకు ఈ అంశంపై అధికారిక స్పష్టత వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపైనే ప్రధాన దృష్టి పెట్టాలని నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం.ఇక పార్టీ సీనియర్ నేత సజ్జల రామకృష్ణ రెడ్డిసమావేశంలో లక్ష్యాల సంఖ్యను తగ్గించుకోవడంపై కాకుండా గెలుపు అవకాశాలను పెంచే మార్గాలపై దృష్టి పెట్టాలని సూచించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించాలంటే ప్రజల మద్దతు, సమర్థవంతమైన ప్రచారం కీలకమని ఆయన అభిప్రాయపడ్డారని సమాచారం.మరోవైపు రానున్న కాలంలో నిర్వహించే ప్రజా కార్యక్రమాలు, ముఖ్యంగా పార్టీ అధినేత చేపట్టనున్న పాదయాత్ర తర్వాత రాజకీయ పరిస్థితులను అంచనా వేసి తుది వ్యూహాన్ని ఖరారు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అప్పటి వరకు అన్ని నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పార్టీ పెద్దలు సూచించినట్లు సమాచారం.

## పెట్రోల్, గ్యాస్ కష్టాలు తీరినట్టే..

ఒమన్‌లోని ప్రధాన పోర్టులు (సలాలా, దుక్మ్ వంటివి) ద్వారా భారత్‌కు చమురు, ఎల్ఎన్‌జీ, ఇతర ఇంధన ఉత్పత్తులు ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా అవుతాయి. ఒమన్ తీర ప్రాంతం హోర్ముజ్ జలసంధికి వెలుపల ఉండటం ఈ ఒప్పందాన్ని వ్యూహాత్మకంగా చాలా ముఖ్యమైనదిగా మార్చింది. ఇది భారత్‌కు సురక్షితమైన, నమ్మదగిన ఇంధన సరఫరా మార్గాన్ని అందిస్తోందిఒమన్‌తో ఒప్పందం కారణంగా హోర్ముజ్‌పై అత్యధిక ఆధారపడటం తగ్గుతుంది. పెట్రోల్, ఎల్‌పీజీ, డీజిల్ సరఫరా స్థిరంగా ఉంటుంది. ధరల పెరుగుదల నియంత్రణలో ఉంటుంది. ప్రజల ఆందోళన తగ్గి, సాధారణ సరఫరా పరిస్థితి ఏర్పడుతుంది.ఈ ఒప్పందం కేవలం తాత్కాలిక పరిష్కారం కాదు. దీర్ఘకాలికంగా భారత్ ఇంధన దిగుమతులను వైవిధ్యపరచడంలో, సప్లై చైన్‌ను బలోపేతం చేయడంలో మైలురాయిగా నిలుస్తుంది.ప్రస్తుత భూరాజకీయ పరిస్థితులు ఏ సమయంలోనైనా హోర్ముజ్ జలసంధిని ప్రభావితం చేసే అవకాశం ఉంది. అలాంటి సమయంలో ఒమన్ లాంటి స్నేహపూర్వక దేశంతో బలమైన వాణిజ్య -- ఇంధన భాగస్వామ్యం ఏర్పాటు చేసుకోవడం భారత్ దూరదృష్టి, వ్యూహాత్మక విజ్ఞతను చూపిస్తోంది. ఇది భారత్ ఇంధన భద్రతలో కొత్త అధ్యాయం.

## మనిషికి ఆరోగ్యానికి మించి ఆస్తి ఉండదు

హైదరాబాద్లో ఉండేవి. నాడు హైదరాబాద్ లో హెల్త్ టూరిజాన్ని ప్రమోట్ చేశాం. దేశంలో ఎక్కడి నుంచైనా ఇప్పుడు హైదరాబాద్ వచ్చి ట్రీట్మెంట్ చేయించుకుంటున్నారు. రాబోయే రోజుల్లో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లోని రోగులు అమరావతి వచ్చి ట్రీట్మెంట్ చేయించుకుంటారు. 15 లక్షల పేషెంట్లకు ఈ ఆసుపత్రి ట్రీట్మెంట్ ఇచ్చింది. బ్రాండ్ ఎస్టిబ్లిష్ చేస్తే దానికి తిరుగుండదనడానికి లలితా ఆసుపత్రి ఒక నిదర్శనమని అన్నారు. విలువలు లేకపోతే లాజికల్ గా తీసుకెళ్లలేం. ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత కలగాలి.. అప్పుడే ఏ వ్యవస్థకైనా మనుగడ. ఏడు ఎకరాల్లో 600 పడకలతో ఈ లలితా ఆసుపత్రి ఏర్పాటైంది. 32 విభాగాలు సేవలందించే ఏకైక సెంటర్. కార్డియాలిజీ, న్యూరీలజీ, జాయింట్ రీప్లేస్మెంట్ వంటి సేవలను ఇక్కడ అందిస్తారు. ల్యాండ్ మార్క్ ఇనిస్టిట్యూట్ గా లలితా ఆసుపత్రి మారుతుంది. మనిషికి ఆరోగ్యానికి మించి ఆస్తి ఉండదు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటేనే నిజమైన ధనవంతుడు. వేల కోట్లు ఉన్నా, ప్యాలెస్ లు ఉన్నా, ఆరోగ్యం లేకపోతే ఉపయోగం లేదు. హెల్తీ సిటిజన్సే వెల్తీ నేషన్ నిర్మిస్తారు. మేం సంజీవని ప్రాజెక్టు తీసుకొచ్చాం. ఇది కంప్లీట్ హెల్త్ కేర్ ప్రోగ్రాం. మంత్రి కూడా ప్రజలకు మెరుగైన వైద్యం కోసం పని చేస్తున్నారు. డిజిటల్ హెల్త్ రికార్డులు తీసుకొస్తున్నాం. ప్రపంచంలోని నాలెడ్జ్ ను, బెస్ట్ ప్రాక్టీస్ తీసుకొచ్చి మీ ఇంటిదగ్గరే అందించేలా సంజీవని పని చేస్తుంది. ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానాన్ని అమలు చేస్తున్నాం. 42 రకాల వైద్య పరీక్షలు ఇంటి దగ్గరే చేస్తాం. ఏ మందులు వేసుకోవాలి, ఎప్పుడు ఆసుపత్రులకు రావాలో సంజీవని ద్వారా చెప్తారు. యూనివర్సిల్ హెల్త్ పాలసీ తీసుకొచ్చాం. రూ.2.5 లక్షల విలువైన వైద్యం ఉచితంగా అందిస్తాం. ప్రజలు ఆసుపత్రులకు వెళ్లే పరిస్థితి తెచ్చుకోవద్దు. తినే తిండి, మన పరిసరాలు, మన ఆలోచనా విధానం చాలా ముఖ్యం. ప్రభుత్వం ఎన్ని వైద్య సేవలు తెచ్చినా, ఆసుపత్రులు కట్టినా ప్రజలు మద్దతు లేకుంటే సాధ్యం కాదని అన్నారు.మంచి అలవాట్లు, ఆహారం, వ్యాయామం ఆరోగ్యానికి పనికొస్తాయి. యోగాకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రాణాయామంకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నాం. ఫుడ్ మెడిసిన్...కిచెన్ ఫార్మసీ. మనం తినే ఆహారమే మనల్ని రక్షిస్తుంది. ఒకప్పుడు కావాల్సిన పంటలు ఎరువులు లేకుండా పండించారు. కానీ ఈ రోజు మొత్తం యూరియా వాడుతున్న ఆహారం తీసుకుంటున్నాం. తెలిసీ తెలియక ఎక్కువగా క్రిమీ సంహారక మందులు వాడుతున్నారు. గత ప్రభుత్వంలో నాసిరకం మద్యం కారణంగా చాలామందికి ఆరోగ్య సమస్యలు వచ్చాయి. ప్రజల జీవితాలతో చెలగాటమాడారుని అన్నారు. .

## రాష్ట్రంలో సవరించిన భూముల మార్కెట్ విలువలు జూన్ 5, నుంచి అమలు

పరిధిలో మార్కెట్ విలువల సమీక్ష నిర్వహించామన్నారు. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు స్థానిక పరిస్థితులను అధ్యయనం చేశాయి. అభివృద్ధి సామర్థ్యం, భూముల డిమాండ్, వేలాలు, మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్నాం ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ కొత్త రహదారులు, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణను ప్రమాణాలుగా తీసుకున్నాం ఫ్లాట్ల విషయంలో ఉన్న అసమానతలను తొలగిస్తూ కొన్ని ప్రాంతాల్లో అన్ని అంతస్తులకు ఒకే రేటు అమలు చేశారు. ఇప్పటికే అధిక మార్కెట్ విలువలు ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి పెంపు ప్రతిపాదనలేదన్నారు. హెచ్ఎండీఏ, సీయూఆర్ఈ పరిధి, ఇతర ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లు నిర్ణయించాం వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కొత్త కనీస రేట్లు ఖరారు చేశాం 2021 తర్వాత నిర్మాణ వ్యయాలు సవరించకపోవడంతో కొత్త రేట్ల అవసరం ఏర్పడింది నిర్మాణ సామగ్రి ధరలు, కార్మికుల వేతనాల పెరుగుదలను పరిగణనలోకి తీసుకున్నాం ఆర్‌సీసీ, నాన్–ఆర్‌సీసీ నిర్మాణాల రేట్లను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సవరించాం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, పారదర్శకతతో ఈ సవరణలు చేపట్టాం భూ లావాదేవీలలో పారదర్శకత పెరగడంతో పాటు ప్రభుత్వ ఆదాయం కూడా వృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## మహానగరంలో ఉండేది ఎలా?

చేస్తున్నారు. విల్లాల అద్దెలైతే ఏకంగా రూ. 1 లక్ష నుండి రూ. 2 లక్షల వరకు పలుకుతున్నాయి. వీటికి అదనంగా మెయింటెనెన్స్ చార్జీల కింద రూ. 2,000 నుండి రూ. 6,000 వరకు, అలాగే కరెంట్, వాటర్ బిల్లులు అదనం. నగరంలో అద్దె ఇళ్లపై ఆధారపడిన వారి పరిస్థితిని జనగణన ప్రాథమిక డేటా స్పష్టం చేస్తోంది. నగరంలోని 65 శాతం కుటుంబాలకు అద్దె ఇళ్లే ఆధారం. వీరిలో 50 శాతం కుటుంబాలకు ఈ ఇళ్ల అద్దెలు తీవ్ర ఆర్థిక భారంగా మారాయి. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లలో అద్దెలు చాలా ఎక్కువగా ఉంటున్నాయి. భూముల ధరలు విపరీతంగా పెరగడం వల్లే ఇళ్ల నిర్మాణ వ్యయం పెరిగి, ఆ ప్రభావం అద్దెలపై పడుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం కనీసం రూ. కోటి పెడితే గానీ నగరంలో సౌకర్యవంతమైన ఇల్లు కొనే పరిస్థితి లేదు. తాము కట్టే అద్దెలు కనీసం హోమ్ లోన్ ఈఎంఐకి సరిపోవాలని కొందరు యజమానులు ఆశిస్తున్నారు. అద్దెలు భరించలేక జనం శివార్లకు వెళ్తున్న నేపథ్యంలో, ప్రభుత్వం ప్రజా రవాణా సౌకర్యాలను పెంచాలని, మెట్రోను విస్తరించాలని తెలంగాణ డెవలపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.వి. రావు అభిప్రాయపడ్డారు.మరోవైపు భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తూ, లక్షల్లో జీతాలు వచ్చే వారికి అద్దె పెద్ద సమస్య కాకపోయినా, రూ. 50,000 లోపు వేతనం వచ్చే వారు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల ఫీజులు, కుటుంబ ఆరోగ్యం కోసమే సగం జీతం ఖర్చవుతుండటంతో, సింగిల్ బెడ్‌రూమ్ ఇల్లు లేదా శివార్లలో రూ. 10,000 లోపు దొరికే ఇళ్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఐటీ కారిడార్‌లో పనిచేసే ఒక ఉద్యోగి తన బడ్జెట్ పరిమితుల వల్ల ఈసీఐఎల్ నుండి రాకపోకలు సాగిస్తుండగా, కేవలం ట్రాఫిక్ కారణంగానే రోజూ 4 గంటల సమయం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు

## ట్రాఫిక్ చలాన్లపై బిగ్ అప్‌డేట్

పెండింగ్‌లో ఉండటం మనం చూస్తూనే ఉన్నాం. చాలా మంది పోలీసులకు చిక్కకుండా.. ట్రాఫిక్ చలాన్లను కట్టకుండా.. ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమిస్తూ.. ఫైన్లు కొండలా పేరుకుపోయే వరకు ప్రయాణిస్తూ ఉంటారు. అయితే ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది.ఇందులో భాగంగానే తెలంగాణలోని వాహనదారులకు రాష్ట్ర ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. ఇక నుంచి ట్రాఫిక్ చలాన్ల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పక్కాగా ఓనర్లకు చేరేలా తెలంగాణ రవాణా శాఖ సరికొత్త నిబంధనను అమలులోకి తీసుకొచ్చింది. ట్రాఫిక్ చలాన్లకు సంబంధించిన అలర్ట్స్‌ను ఎప్పటికప్పుడు పొందేందుకు ప్రతీ ఒక్కరూ తమ వివరాలను వెంటనే వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేసుకోవాలని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కొత్త నిబంధనల ప్రకారం.. ప్రతీ ఒక్క వాహనదారుడు తమ మొబైల్ నంబర్, వాట్సాప్ నంబర్, ఈ–మెయిల్ ఐడీ వంటి వివరాలను నెల రోజుల్లోగా కేంద్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ అయిన వాహన్ (ఝుఝ్ఝుఅ.ఝుఠీఅఝుఝ్ఝుఅ.ఓ్రశీజ.ఱఅ లో తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని రవాణా శాఖ ఆదేశాలు జారీ చేసింది.ఇక ప్రభుత్వం ఇచ్చిన నెల రోజుల గడువు ముగిసిన తర్వాత.. వాహన్ పోర్టల్‌లో నమోదై ఉన్న సెల్ నంబరు, ఈ–మెయిల్‌కు ఎస్ఎంఎస్, వాట్సాప్, మెయిల్ ద్వారా ట్రాఫిక్ చలాన్లను సంబంధిత వాహన యజమానికి పంపిస్తారు. ఇలా పంపిన ట్రాఫిక్ చలాన్లు.. వారికి అందినట్లుగానే రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది. ఇంతకుముందు లాగా.. తమ ఫోన్‌కు ట్రాఫిక్ చలాన్ రాలేదని.. దానికి సంబంధించి మెసేజ్ కూడా రాలేదని.. అసలు తమ బండిపై ట్రాఫిక్ చలాన్ ఉందనే సమాచారం కూడా తమకు తెలియదని వాహనదారులు చలాన్లు తప్పించుకోవడానికి వీలు ఉండదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.గతంలో ఇలాంటి సాకులు చెప్పి.. కొందరు వాహనదారులు ట్రాఫిక్ చలాన్లు కట్టకుండా తప్పించుకునే వారని తెలిపాయి. పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలాన్ల వసూళ్లను మరింత వేగంగా వసూలు చేయడానికి.. ట్రాఫిక్ చలాన్ల విషయంలో మరింత పారదర్శకతను పెంచడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## బంగారం విక్రయిస్తున్న భారత్

రూ.57 వేల కోట్లు విలువైన పసిడి నిల్వలను విక్రయించినట్లు ప్రముఖ వార్తా సంస్థ బ్లూమ్ బర్గ్ తెలిపింది.ఫారెక్స్ నిల్వలు వృథాగా పోకుండా చూసేందుకు బంగారం దిగుమతిపై కస్టమ్స్ సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం రెట్టింపు కంటే పెంచి 15 శాతానికి చేసింది. ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉన్నా, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ఆర్థిక స్థితి దెబ్బతినకుండా చూసేందుకు పెట్రోల్, డీజిల్ ధరలనూ పెంచింది. అలాగే రిజర్వ్ బ్యాంక్ తన వద్ద ఉన్న నిల్వల్లో రూ.57 వేల కోట్ల పసిడిని మే 22తో ముగిసిన రెండు వారాల వ్యవధిలో విక్రయించింది. తద్వారా విదేశీ కరెన్సీ ఆస్తులకు ఈ మొత్తాన్ని జమ చేసుకుంది. మన ఫారెక్స్ నిల్వల్లో విదేశీ కరెన్సీ ఆస్తులు 543.032 బిలియన్ డాలర్లు కాగా పిసిడి నిల్వలు 114.786 బిలియన్ డాలర్ల మేర ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ లెక్కల ప్రకారమే 2 వారాల్లో పసిడి నిల్వల విలువ 6 బిలియన్ డాలర్లకు పైగా తగ్గింది.దేశ ఎగుమతుల కంటే దిగుమతులు బిల్లు భారీగా పెరుగుతోంది. దీంతో కరెంటు ఖాతా లోటు అంతకంతకూ అధికమవుతోంది. రూపాయి విలువ ఈ సంవత్సరంలో 7 శాతం వరకు పతనం అయ్యేందుకు కారణమైంది. అందుకే మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా ఉన్న సమయంలో డాలర్ నిల్వలను పెంచుకుని, రూపాయిని బలోపేతం చేయడంపై రిజర్వ్ బ్యాంక్ దృష్టి పెట్టింది. అందుకే బంగారం విక్రయిస్తోంది. ఈ ఏడాది మార్చి నెలలో ఆర్బీఐ వద్ద 880.52 టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయి. వీటిలో 77 శాతం నిల్వలు భారత్‌లోనే ఉన్నాయి. అంతకు 6 నెలల క్రితం మన దేశంలో ఉన్న బంగారం నిల్వలు 66 శాతంగా ఉండడం గమనార్హం. మిగిలిన బంగారం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్మెంట్స్ దగ్గర ఉండేది.

## ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం..

సహాయక బృందాలను ఘటనాస్థలికి తరలించింది. మంటలు వేగంగా వ్యాపించడంతో రెస్టారెంట్ బేస్‌మెంట్‌లో చిక్కుకుపోయిన పలువురు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అగ్నిమాపక సిబ్బంది సాహసోపేతంగా 37 మందిని బేస్‌మెంట్ నుంచి రక్షించి, క్యాట్స్ అంబులెన్స్‌ల ద్వారా ఆస్పత్రులకు తరలించారు. అనంతరం గాయపడిన 11 మందికి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు స్పందిస్తూ.. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యుల నివేదిక వచ్చిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. మరోవైపు మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు 10 అగ్నిమాపక వాహనాలను రంగంలోకి దించారు. అగ్నిప్రమాదం అదుపులోకి వచ్చినప్పటికీ భవనంలో మరెవరైనా చిక్కుకుపోయి ఉన్నారేమోనన్న అనుమానంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అగ్నిమాపక శాఖ, పోలీసులు భవనాన్ని పూర్తిగా తనిఖీ చేస్తున్నారు. అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఘటనపై కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు చేపట్టారు. మంటలు ఎలా చెలరేగాయి? భవనంలో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు పాటించారా? అనే అంశాలపై విచారణ కొనసాగుతోంది.






# అక్రెడిటేషన్‌తో సంబంధం లేకుండా గ్రేటర్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

## ముఖ్యమంత్రికి జీహెచ్‌జే సొసైటీ విజ్ఞప్తి

సికింద్రాబాద్, జూన్ 03 (వాయిస్ టుడే ప్రతినిధి): సుప్రీం కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్ ప్రకారం అన్ని కేటగిరీల్లోని జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ చిక్కడపల్లి లోని త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలు, సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జర్నలిస్టులందరికి వెంటనే ఇళ్ళస్థలాలు కేటాయించాలని సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా.. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం విచారకరమని పలువురు సీనియర్ జర్నలిస్టులు అన్నారు. గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీకి స్థలం లేదా సభ్యులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతూ తీర్మానించింది.

అక్రెడిటేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం ఇవ్వాలని, జర్నలిస్టుల్లో వివక్ష చూపొద్దని సమావేశం కోరింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పని చేస్తున్న అన్ని కేటగిరీల జర్నలిస్టులకు 200 చ. గ స్థలాన్ని ఫ్యూచర్ సిటీలో కేటాయించాలని కోరుతూ సమావేశం తీర్మానించింది. సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, సొసైటీలో సభ్యత్వం తీసుకున్న 1350 మంది గ్రేటర్ జర్నలిస్టులు 18 ఏళ్ళుగా ఇంటి జాగల కోసం ఎదురు చూస్తున్నారని, గత ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని, కనీసం ఈ ప్రభుత్వం అయినా ఇళ్ళస్థలాలిచ్చి ఆదుకోవాలని కోరారు. గ్రేటర్ సొసైటీలో ఉన్న దాదాపు 1350 మంది జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం చాలా ఏళ్ళుగా ఎదురుచూస్తున్నారని, ఇప్పటికే ఎంతోమంది జర్నలిస్టులు స్థలం పొందకుండానే చనిపోయారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పలువురు మంత్రులను కలిసి పలుమార్లు విన్నవించినప్పటికీ స్థలం కేటాయింపునకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా ప్రభుత్వం చేతులెత్తేసిందని, మొన్న జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళస్థలాలపై ఎటువంటి నిర్ణయం లేదని, నిన్న జరుపుకున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో ముఖ్యమంత్రి చేసిన ప్రసంగంలో జర్నలిస్టుల సంక్షేమం, ఇళ్ళస్థలాల మాటే లేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును పక్కన పెట్టి ప్రత్యామ్నాయ జీవోల ద్వారా జర్నలిస్టు సొసైటీలకు స్థలాలు ఇవ్వాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.

### మద్దతు ప్రకటించిన కోదండరాం

సొసైటీ సర్వసభ్య సమావేశానికి హాజరుకావాల్సిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అనివార్యకారణాల వల్ల హాజరుకాలేకపోయారు. దీంతో ఆయన ఫోన్ ద్వారా తన సందేశాన్ని సమావేశానికి వినిపించారు. గ్రేటర్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి తన మద్దతు ఉంటుందని, ముఖ్యమంత్రితో మాట్లాడి జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చేవిధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా సమావేశానికి రావాల్సిన రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్ కుమార్ యాదవ్ అత్యవసర పని వల్ల రాలేకపోయారు. ఆయన కూడా సొసైటీ సమావేశానికి మద్దతు తెలియజేశారు. అంతకు ముందు సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నైశిదం సత్యనారాయణ మూర్తి, తెలంగాణ జనసమితి గ్రేటర్ బీసీ సెల్ అధ్యక్షుడు జశ్వంత్, సీనియర్ జర్నలిస్టులు తీగవరపు శాంతి, నాగవాణి, సొసైటీ కోశాధికారి తన్నీరు శ్రీనివాస్, డైరెక్టర్లు యర్రమిల్లి రామారావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల పరిశీలనలో కాలనీ సంఘాలు అప్రమత్తంగా ఉండాలి

### నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి



నాగారం, జూన్ 3:-(వాయిస్ టుడే): నాగారం డివిజన్ పరిధిలోని అన్ని కాలనీ అధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు మరియు కాలనీ వాసులందరికీ ఓటర్ల పర్యవేక్షణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాసరెడ్డి బుధవారం విజ్ఞప్తి చేశారు. మన కాలనీలలోని కొన్ని ఇళ్ల చిరునామాలపై సంబంధిత కుటుంబాలకు తెలియకుండా అనర్హంగా లేదా తప్పుగా ఓటర్లు నమోదై ఉండవచ్చునే అంశంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. మీ ఇంటి చిరునామాపై నమోదైన ఓటర్ల వివరాలను పరిశీలించి, అక్కడ నివసించని వారి పేర్లు ఉన్నట్లయితే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. ఈ నెలలో ప్రభుత్వం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని, ఈ కార్యక్రమం ద్వారా అధికారులు ఇంటింటికీ వచ్చి ఓటరు వివరాలను ధృవీకరిస్తారన్నారు. ఆ సమయంలో మీ ఇంటి వివరాలను సక్రమంగా తెలియజేసి, ఏవైనా తప్పులు ఉన్నట్లయితే వాటిని సరిదిద్దేందుకు పూర్తి సహకారం అందించాలని కోరారు.

ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన మరియు పారదర్శకమైన ఓటరు జాబితాలు అత్యంత అవసరం అన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి అధికారులకు సహకరించి, ఓటరు జాబితాల్లోని పొరపాట్లను సరిదిద్దే ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మన కాలనీ అభివృద్ధి, సమాజ శ్రేయస్సు మరియు స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల కోసం మీ అందరి సహకారం ఎంతో అవసరం అన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని కోరారు.



## జీడిమెట్ల సర్కిల్ ప్రజల సమస్యల పరిష్కారం కోసం వాటర్ వర్క్స్ అధికారులకు వినతిపత్రం సమర్పణ

కుత్బుల్లాపూర్ జూన్ 3(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని కుత్బుల్లాపూర్ డివిజన్, పేట్ బషీరాబాద్ డివిజన్ మరియు పద్మానగర్ డివిజన్ (జీడిమెట్ల డివిజన్) ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మంచి నీటి సరఫరా, పెండింగ్ యూజీడీ పనులు మరియు డ్రైనేజీ నిర్వహణ సమస్యలపై వాటర్ వర్క్స్ డి.జి.ఎం. ప్రసాద్ బాబు వినతిపత్రం సమర్పించి ప్రజలకు సరిపడా పరిమాణంలో మరియు సమయానికి మంచి నీటి సరఫరా అందించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న యూజీడీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అలాగే యూజీడీ మరియు డ్రైనేజీ లైన్లను క్రమం తప్పకుండా శుభ్రపరచి నిర్వహించాలని కోరి, జీడిమెట్ల సర్కిల్ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి.

ఈ కార్యక్రమంలో జీడిమెట్ల డివిజన్ అధ్యక్షులు జోగిని రాజు, వీరారెడ్డి, నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్, నల్లనాగుల కృష్ణ, పెద్దింటి సాయిలు, ప్రభాకర్ రెడ్డి, సాయిబాబా, గంగాధర్, ప్రవీణ్ గౌడ్, పాపయ్య దొర, రామన్, బాలరాజ్, మహేష్, శ్రవణ్ బోస్, శ్రవణ్, అంజయ్య, జ్ఞానేశ్వర్, కృపాల్ యాదవ్, ప్రభు, రమేష్, నిఖిల్, రాజు, కైలాసం, నరేందర్ రెడ్డి, రాజేష్, శివ, వెంకట రాజు, నోముల శ్రీనివాస్, సతీష్, రన్వీత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మణ్ నాయక్‌ను ఆదుకోండి

### మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్



కుత్బుల్లాపూర్ జూన్ 03(వాయిస్ టుడే ): దుండిగల్ డివిజన్ గాగిల్లాపూర్ తండాకు చెందిన కాట్రోత్ లక్ష్మణ్ నాయక్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న లక్ష్మణ్ నాయక్ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో వైద్య పరీక్షలు చేయించుకోగా, ఆయన రెండు కిడ్నీలు మరియు లివర్ తీవ్రంగా దెబ్బతిన్నట్లు వైద్యులు నిర్ధారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లక్ష్మణ్ నాయక్ కుటుంబం అత్యంత దయనియా స్థితిలో ఉండి . ఆయనకు పెళ్లి కావాల్సిన నలుగురు ఆడపిల్లలు , ఒక కుమారుడు ఉన్నారు. తండ్రి అనారోగ్యంతో ఉండటంతో కుమారుడు చదువు మానేసి ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తూ కుటుంబ పోషణ బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితిలో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న దుండిగల్ మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ లక్ష్మణ్ నాయక్‌ను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తన వంతు సహాయంగా రూ.10,000వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. చిన్న చాలి చాలని ఇల్లులో నివసిస్తూ అనేక కష్టాలు పడుతున్న ఈ కుటుంబాన్ని మానవత్వంతో ప్రతి ఒక్కరూ ఆదుకోవడానికి ముందుకు రావాలని ఆయన కోరారు. అలాగే ఈ విషయాన్ని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు దృష్టికి, ఎమ్మెల్యే వివేకానంద దృష్టికి మాజీ మున్సిపల్ చైర్మన్ శంబిపూర్ కృష్ణ దృష్టికి తీసుకు వెళ్తానని ప్రభుత్వ పరంగా సహాయం అందేలా ప్రయత్నిస్తానని మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ తెలిపారు.

## శిల్పానగర్‌లో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



నాగారం, జూన్ 3:-(వాయిస్ టుడే): నాగారం డివిజన్ పరిధిలోని శిల్పానగర్‌లో బుధవారం నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం మాజీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు మాదిరెడ్డి వెంకటరెడ్డి, హరిబాబు, సుమిత్ర సురేష్, మాజీ సర్పంచ్ గూడూరు అశోక్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు పంగా ముత్యాలు, కిరణ్ జ్యోతి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే యువ నాయకులు కౌకుంట్ల జీవన్ రెడ్డి, వంగేటి పర్వత్ రెడ్డి, కౌకుట్ల శ్రీనివాస్ రెడ్డి, కందాడి శ్రీనివాస్ రెడ్డి, చిట్యాల శ్రీనివాస్ రెడ్డి, భద్రు నాయక్, పంగా సంతోష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్నీ యాదవ్, దాసోం నర్సింహారావు మరియు ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. కాగా గృహప్రవేశం చేసిన కుటుంబ సభ్యులకు నాయకులు శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ వద్దిరాజు

### పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు

హైదరాబాద్, జూన్ 3: వాయిస్ టుడే : బీఆర్ఎల్పీ ఉప నాయకులు, మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావుకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హరీష్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం రాత్రి హైదరాబాద్ నానకరాంగూడలోని ఆయన నివాసానికి వెళ్లిన ఎంపీ రవిచంద్ర, హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



## న్యాయవాదుల సంక్షేమానికి మరో ముందడుగు: కాంగ్రెస్ లీగల్ సెల్

### న్యాయవాదుల రక్షణ చట్టం అమలుపై హర్షం..

### కాంగ్రెస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో సంబరాలు

హనుమకొండ, జూన్ 03: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమల్లోకి తీసుకురావడంపై కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం. హనుమకొండ లో ఘనంగా సంబరాలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 41 (తేదీ: 02-06-2026) ద్వారా న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయడాన్ని స్వాగతిస్తూ మహాత్మా గాంధీ బార్ అసోసియేషన్ హాల్‌లో కేక్ కట్ చేసి స్వీట్లు, శీతల పానీయాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. న్యాయవాదుల సంక్షేమం, భద్రత కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తోందని, రాష్ట్రంలోని న్యాయవాదులందరూ ప్రభుత్వానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రివర్గ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు ముద్దసాని సహోదర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి తోగారి జగన్మోహన్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రావుల శ్రీనివాస్ రెడ్డి, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తోట రాజుకుమార్, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ హ్యూమన్ రైట్స్ ఒ ఆర్టీఐ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ నల్ల మహాత్మా, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వేముల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే సీనియర్ న్యాయవాదులు నీలా శ్రీధర్ రావు, పాము రమేష్, మాద సుజన్, ప్రభంజన్, మేడ రంజిత్ కుమార్, బత్తిని రమేష్ గౌడ్, మహేందర్, వినయ్ కుమార్, శ్రీనివాస్, తిరుపతి, సురేందర్, రాజేష్, కృష్ణ కుమార్, ప్రేమ్ కుమార్, నగేష్, విష్ణువర్ధన్ రెడ్డి, భవాని ప్రసాద్ తదితర న్యాయవాదులు పాల్గొని ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ సంబరాలు జరుపుకున్నారు.



## "పర్యావరణ పరిరక్షణ దినోత్సవం" పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్, జూన్ 03: ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా నవభారత్ నిర్మాణ్ సంఘ్ - అధ్యక్షులు అడ్వకేట్ సురేపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "పర్యావరణ పరిరక్షణ దినోత్సవం" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ప్రముఖ సామాజిక సేవకుడు అమూర్త్ కుమార్ జైన్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జూన్ 6వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో పర్యావరణ అవగాహన సదస్సు, కవి సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రజలకు సందేశమిస్తూ.. "సైకిల్ చలావో -- సెహత్ బచావో, పర్యావరణ్ కా రక్షా కరో" "సైకిల్ తొక్కండి -- ఆరోగ్యాన్ని కాపాడండి, పర్యావరణాన్ని రక్షించండి" అని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు, ఆరోగ్యకర జీవన విధానానికి మద్దతుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, సామాజిక సేవా సంస్థలు, పర్యావరణ ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అమూర్త్ కుమార్ జైన్, అడ్వకేట్ సురేపల్లి రవికుమార్, అశోక్ హీరావత్, లయన్ గోపిశెట్టి ప్రమోద్, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాయిస్
హైదరాబాద్
గురువారం 4 జూన్ 2026



## మూసాపేట్‌లో శ్రీ పోచమ్మతల్లి-ఎల్లమ్మతల్లి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ మహోత్సవంకు ఆహ్వానం

కూకట్‌పల్లి, జూన్ 3(వాయిస్ టుడే): మూస్కీపేట్ (మూసాపేట్) గ్రామంలోని శ్రీశ్రీశ్రీ పోచమ్మతల్లి--ఎల్లమ్మతల్లి దేవాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం (04-06-2026) ఘనంగా మహోత్సవాలను నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సంవత్సర అధిక జ్యేష్ఠ బహుళ చవితి సందర్భంగా నిర్వహించే ఈ వేడుకలకు గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీర్వాదాలు పొందాలని కోరారు. ఈ సందర్భంగా ఉదయం 6.00 గంటలకు పుణ్యాహవాచనం, ఉదయం 7.00 గంటలకు ప్రత్యేక హోమం, అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ మహోత్సవాల్లో భక్తులందరికీ తీర్థప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. దేవాలయ ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు. గ్రామ శాంతి, సౌభాగ్యం, ప్రజల ఆయురారోగ్యాలు, సస్యశ్యామలత కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారి దర్శనం చేసుకుని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందాలని దేవాలయ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.



## దుర్గమ్మ పండుగ జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్

### దుర్గమ్మ పండుగ జాతరలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ కు ఆలయ కమిటీ ఘన సన్మానం

(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి ):- భువనగిరి పట్టణ పరిధిలోని రాయగిరి దుర్గమ్మ పండుగ జాతర బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ జాతర మహోత్సవానికి భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్‌పర్సన్ ఆలయానికి విచ్చేసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ, దుర్గమ్మ తల్లి కరుణాకటాక్షాలతో పట్టణ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, గత సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా భారీ వర్షాలు కురిసి పచ్చని పసిడి పంటలతో రాష్ట్రం తులతూగాలని ఆమె అమ్మవారిని కోరినట్లు తెలిపారు. జాతరకు తరలివచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపాలిటీ తరపున తాగునీరు, పారిశుధ్యం,వైద్య శిబిరం, లైటింగ్ వంటి అన్ని మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పట్టణ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ ని, పీసీసీ డెలిగేట్ తంగళ్లపల్లి రవికుమార్ ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, 3వ వార్డు కౌన్సిలర్ పాత్యాల వెంకటేష్, కో-ఆప్షన్ సభ్యులు యాదగిరి, కాంగ్రెస్ నాయకులు ఆవిశెట్టి పాండు, ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇంటితో పేద ప్రజల ఆశలు నెరవేరుతున్నాయి

### :-మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి

(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి ):- పురపాలక సంఘ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల ఉత్తర్వుల కాపీని 24వ వార్డుకు చెందిన తునికి అనితకు అందజేసిన సందర్భంలో కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద ప్రజల ఆశలు ఇందిరమ్మ ఇండ్లతోనెరవేరుతున్నాయని, ఈ యొక్క పథకమును ప్రతి ఒక్క నిరుపేద ఖాళీ స్థలం ఉంటే వినియోగించుకుని ఇంటి కల నెరవేర్చుకోవాలని అన్నారు. రూ.5.00 లక్షల రూపాయలుసంపాదించాలంటే పేదలకు సంవత్సరాల కాలం పడుతుందని అందుకు ప్రతి ఒక్క నిరుపేద ఈ పథకమును సద్వినియోగం పరుచుకొని తమ ఇంటి కల నెరవేర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు చల్లగురుగుల రఘుబాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మరియు మాజీ కౌన్సిలర్ ఎండి షఫీక్ అహమద్ తునికి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు పుట్టిన రోజు

## రామంతాపూర్ ప్రభుత్వ పాఠశాలలో బండారు లక్ష్మారెడ్డి విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు పుట్టిన రోజునీ పురస్కరించుకొని రామంతాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం బి ఆర్ ఎస్ పార్టీ యువ నాయకులు లావంగు నవీన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, హరీష్ రావు జన్మదినాన్ని సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం ఎంతో సంతోషకరమని అన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకుని భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.లావంగు నవీన్ మాట్లాడుతూ, హరీష్ రావు జన్మదినం సందర్భంగా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని



సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.హరీష్ రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేయడం పట్ల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బి.ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పల్ కావేరి నగర్‌లో రూ.40 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు

### :- ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- ఉప్పల్ డివిజన్ కావేరి నగర్‌లో రూ.40 లక్షలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు.ఇటీవల కాలనీల్లో పర్యటించిన సందర్భంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేయిస్తానని ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మొత్తం రూ.40 లక్షలతో డ్రైనేజీ, నిర్మాణం పనులు చేపట్టరు.రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ..

“కాలనీవాసులతో కలిసి పనులను పరిశీలించారు . వర్షాకాలం లోపు డ్రైనేజీ పనులు సకాలంలో పూర్తి చేయాలనిలిఅధికారులను కోరారు . త్వరలోనే సీసీ రోడ్ల నిర్మాణ పనులు కూడా ప్రారంభం కానున్నాయి. ఇచ్చిన మాట ప్రకారం కావేరి నగర్‌ను ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతాం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి,కాలనీ అధ్యక్షులు,సల్ల ప్రభాకర్ రెడ్డి,నాయుడు, శ్రీనివాస రెడ్డి,వెంకటేష్ గుప్త ,ప్రసాద్,రఘుపతి రెడ్డి ,లక్ష్మి రెడ్డి ,నవీన్ చారి ,అప్పుల మురళి ,మోహన్ రెడ్డి ,పోచయ్య ,ఖాసీం ,బాల్ రెడ్డి ,వెంకట్ రెడ్డి ,మురళీ చారి ,ప్రవీణ్ గౌడ్,అనంతయ్య, సృజనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నాగారం, రాంపల్లి ఆల్ కాలనీలలో సమస్యలు పరిష్కరించాలి

### ఎంఎంసీ కమీషనర్ కృష్ణారెడ్డికి వినతిపత్రం

నాగారం, జూన్ 3:-(వాయిస్ టుడే): మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో నాగారం, రాంపల్లి ఆల్ కాలనీల సంక్షేమ సంఘం నుండి ప్రతినిధి బృందం ఎంఎంసి కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఐఎఎస్ ని అధికారికంగా కలిసింది. నాగారం మరియు రాంపల్లి ప్రాంతాల వ్యాప్తంగా రోడ్డు మరియు డ్రైనేజీ అభివృద్ధి పనుల తక్షణ ఆవశ్యకతను నొక్కిచెబుతూ, ఆ ప్రతినిధి బృందం ఒక అధికారిక వినతిపత్రాన్ని సమర్పించింది. అంతేకాకుండా, నివాసితులు ఎదుర్కొంటున్న పౌర సమస్యలను స్వయంగా పరిశీలించడానికి తమ కాలనీలను వ్యక్తిగతంగా సందర్శించవలసిందిగా కమిషనర్‌ను సాదరంగా అభ్యర్థించారు.

### కమీషనర్ గారి హామీ....

కమీషనర్ ఆ వినతిపత్రం పై సానుకూలంగా స్వీకరించి, లేవనెత్తిన ఆందోళనలను క్షుణ్ణంగా సమీక్షించి, తక్షణ చర్యలు తీసుకుంటామని ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్వ కాలనీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం. వేణుగోపాల్, కార్యనిర్వాహక అధ్యక్షుడు సాయినాథ్ గౌడ్, ఉపాధ్యక్షుడు దుర్గా ప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రాజు, కోశాధికారి రామ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి కుమార్ యాదవ్ నిర్వహణ కార్యదర్శి భాస్కర్ రెడ్డి, కమిటీ సభ్యులు హనుమంత్ రావు, ఇంకా రాజా, వంశీ, శ్రీనివాస రావు, రాఘవ రావు, రామకృష్ణ (సమన్వయకర్త), ఈ విషయానికి సంబంధించిన తదుపరి పురోగతిపై కాలనీల ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తామని వారు తెలిపారు. కాగా మెరుగైన భవిష్యత్తు కోసం మనం కలిసి పనిచేస్తున్నప్పుడు మీరు అందిస్తున్న నిరంతర మద్దతుకు మీ అందరికీ ధన్యవాదాలు. మెరుగైన మౌలిక సదుపాయాలు, మెరుగైన సమాజాలు మరియు మెరుగైన ప్రజా సంక్షేమం కోసం కలిసికట్టుగా. సర్వ కాలనీల సంక్షేమ సంఘం, నాగారం, రాంపల్లి ఎంఎంసి సంఘం పేర్కొంది.

## నారాయణ నగర్ షార్ట్‌లో సర్క్యూట్ ప్రమాదంపై కంటెస్టెంట్ కార్పొరేటర్ ఫిర్యాదు

### తక్షణమే స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు



సికింద్రాబాద్, జూన్ 03 (వాయిస్ టుడే ప్రతినిధి): బౌద్ధనగర్ డివిజన్ పరిధిలోని ఎల్. నారాయణ నగర్‌లో జరిగిన షార్ట్ సర్క్యూట్ ప్రమాదంపై కంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తి హర్షకిరణ్ తక్షణమే స్పందించారు. స్థానిక ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విద్యానగర్ విద్యుత్ శాఖ అధికారులు సైతం అత్యంత వేగంగా స్పందించారు. డిఈ సమయ, ఏడి ధనుంజయ్, ఏఈ సత్యనారాయణ లు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షేత్రస్థాయి పరిశీలన చేసి, నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి తక్షణ చర్యలు చేపట్టడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు మళ్లీ జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ప్రమాదాల నివారణకు సంబంధించిన శాశ్వత పనులను వెంటనే ప్రారంభిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ప్రజా సమస్యపై సానుకూలంగా, వేగంగా స్పందించిన విద్యుత్ శాఖ అధికారులకు కీర్తి హర్షకిరణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.



## అర్హుల ఓట్ల తొలగింపు కుట్రలను అడ్డుకోవాలి

### బీ. ఆర్. ఎస్. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సికింద్రాబాద్, జూన్ 03 (వాయిస్ టుడే ప్రతినిధి): ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్. ఐ. ఆర్.) పేరిట అర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపు ఆరోపణలు ఉన్నాయని, అందుకే బీ. ఆర్. ఎస్. కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించి తమ ఓటు బ్యాంకు ను పదిలపరచుకోవాలని బీ. ఆర్. ఎస్. వర్కింగ్ ప్రెసిడెంట్ కే. టీ. రామారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం సీతాఫల్మండి అరటి పర్వస్ ఫంక్షన్ హాల్ లో సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బీ. ఆర్. ఎస్. ప్రతినిధుల సమావేశం జరిగింది. బీ. ఆర్. ఎస్. యువ నేత తీగుల్ల రామేశ్వర గౌడ్ అధ్యక్షత వహించిన ఈ సమావేశం లో కే. టీ. రామారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గం తెలంగాణ వాదానికి కంచుకోటగా మారిందని, ఓటర్లను చేతన్యవంతులను చేశామని తెలిపారు. మాజీ మంత్రి, శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్రజాస్వామ్య పద్దతులను పాటిస్తున్నారని విమర్శించారు. బీ. ఆర్. ఎస్. ప్రధాన కార్యదర్శి ఆర్. ఎస్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరాన్ని విచ్చిననం చేసే కుట్రలను అడ్డుకోవాలని కోరారు. యువ నేత రామేశ్వర గౌడ్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు ఐక్యమత్యంగా వ్యవహరించి ఓటర్ల జాబితా సవరణ, సభ్యత్వ నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. ముషీరాబాద్ శాసనసభ్యులు మూటా గోపాల్, కంటోన్మెంట్ ఇంచార్జ్ క్రిశాశీక్, మాజీ ఏం. ఎల్. . సలీం, బీ. ఆర్. ఎస్. యువ నేతలు తీగుళ్ళ కిశోర్ కుమార్, త్రినేత్ర గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంటు ఇంచార్జ్ తలసాని సాయి కిరణ్ యాదవ్, నేత జైసింహా, మాజీ కార్పొరేటర్లు సామాల హేమ, కంది శైలజ, రాసురి సునీత, లింగాల ప్రసన్న లక్ష్మీ శ్రీనివాస్, సమన్వయకర్త రాజా సుందర్, ఎన్నికల ఇంచార్జ్ డీ. రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళా వారోత్సవాల సందర్భంగా మహిళా సంఘాలతో సమావేశం

కుత్బుల్లాపూర్ జూన్ 03(వాయిస్ టుడే ): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు ఆధ్వర్యంలో, మహిళా వారోత్సవాల సందర్భంగా 292 సాయిబాబా నగర్ డివిజన్‌లోని మహిళా సంఘాల గ్రూప్ సభ్యులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు మంత్రి సీతక్క ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించి, వాటి ద్వారా మహిళలకు కలిగే ప్రయోజనాలను తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాదురుపల్లి మాజీ సర్పంచ్ మైసి గారి శ్రీనివాస్ సమైక్య లీడర్లు జ్యోతి రెడ్డి కుర్షిత్ బేగం భాస్కర్ రెడ్డి శ్యామ్ గురవా రెడ్డి సత్తి రెడ్డి గోపాల్ అనిత రెడ్డి కుమారి మరియు డ్వాక్రా మహిళా సంఘాల గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

# మోదీ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం

**తెలంగాణలో 7,597 కోట్లతో 4 వరుసల జాతీయ రహదారుల విస్తరణకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్...**

**ఆర్మూర్-మంచిర్యాల, జగిత్యాల-కరీంనగర్ మార్గాల్లో తగ్గనున్న ట్రాఫిక్ కష్టాలు...**

**రహదారుల విస్తరణపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హర్షం...**

**తెలంగాణ అభివృద్ధికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉంది...**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి...**



సికింద్రాబాద్, జూన్ 03 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణలో రహదారుల అనుసంధాన్ని మరింత బలోపేతం చేస్తూ కేంద్ర ప్రభుత్వం మరో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ఉత్తర జిల్లాల రవాణా ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చే విధంగా రూ. 7,597.16 కోట్ల భారీ అంచనా వ్యయంతో 190.76 కిలోమీటర్ల జాతీయ రహదారుల విస్తరణ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (CCEA) ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం పట్ల కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రగతికి, మౌలిక వసతుల కల్పనకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఈ నిర్ణయమే మరొక నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజల తరఫున ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి, కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీకి కిషన్ రెడ్డి గారు ప్రత్యేక ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ ప్రాజెక్టులో భాగంగా నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాలను అనుసంధానించే ఎన్ హెచ్-63 లోని ఆర్మూర్-జగిత్యాల- మంచిర్యాల మార్గాన్ని హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (HAM) పద్ధతిలోనూ, అలాగే జగిత్యాల, కరీంనగర్ జిల్లాలను కలిపే ఎన్ హెచ్-563 లోని జగిత్యాల-కరీంనగర్ మార్గాన్ని బిల్డ్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ (BOT-Toll) పద్ధతిలోనూ నాలుగు వరుసల (4-Lane) రహదారులుగా విస్తరించనున్నారు. ప్రస్తుతం అంకాపూర్, కోరుట్ల, ధర్మపురి, గంగాధర వంటి తీవ్ర జనసాంద్రత, నిరంతర రద్దీ ఉన్న పట్టణ ప్రాంతాల గుండా వెళ్లడం వల్ల ఈ మార్గాల్లో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. దీనిని అధిగమించడానికి రద్దీ ప్రాంతాల్లో కొత్తగా బైపాస్ రోడ్లను నిర్మిస్తూ, గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా ఓపెన్ టోలింగ్ సౌకర్యంతో ఈ రహదారులను అత్యాధునికంగా తీర్చిదిద్దనున్నారు. ఈ భారీ ప్రాజెక్టు అందుబాటులోకి రావడం వల్ల ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడమే కాకుండా ఆర్థిక, సామాజిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. నిర్మాణం పూర్తయిన తర్వాత ఆర్మూర్ - మంచిర్యాల మధ్య ప్రయాణ సమయం దాదాపు 1 గంట 30 నిమిషాలు, అలాగే జగిత్యాల - కరీంనగర్ మధ్య దాదాపు 45 నిమిషాలు ఆదా అవుతుంది. ఇది వాహనాల నిర్వహణ ఖర్చులను, ఇంధన వినియోగాన్ని తగ్గించి, పర్యావరణానికి హాని చేసే కార్బన్ ఉద్గారాలను నియంత్రిస్తుంది.

కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'పీఎం గతిశక్తి' సూత్రాల ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ రహదారులు వరంగల్, సిద్దిపేట రాజ్జులు, నిజామాబాద్ మెగా ఫుడ్ పార్క్ వంటి 5 ఆర్థిక కేంద్రాలను, వేములవాడ, కొండగట్టు, కాళేశ్వరం వంటి 7 ప్రముఖ పుణ్యక్షేత్రాలను మరియు వివిధ రైల్వే స్టేషన్లతో కూడిన 10 లాజిస్టిక్స్ కేంద్రాలను ఒకదానితో ఒకటి అనుసంధానిస్తాయి. దీనివల్ల సరుకు రవాణా వేగవంతమై దేశ లాజిస్టిక్స్ పనితీరు మెరుగుపడటమే కాకుండా, స్థానికంగా సుమారు 77 లక్షల రోజులకు సరిపడా పనిదినాల మ్యాన్ - డేస్ (మనుషుల రోజువారీ కూలి) రూపంలో ప్రత్యక్ష మరియు పరోక్ష ఉపాధి అవకాశాలు లభించి, తెలంగాణ ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.



## టీపీసీసీ ఎస్సీ విభాగ రాష్ట్ర కార్యదర్శిగా మనీషా విష్ణు

సికింద్రాబాద్, జూన్ 03 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మనీషా విష్ణును నియమించినట్లు ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డా. కవ్వంపల్లి సత్యనారాయణ ప్రకటించారు. ఈ మేరకు సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ గౌడ్, తోపాటు ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డా. కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా మనీషా విష్ణు అందుకున్నారు. పార్టీ బలోపేతానికి, ముఖ్యంగా ఎస్సీ విభాగాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత చైతన్యవంతంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దడంలో మనీషా విష్ణు కీలక పాత్ర పోషిస్తారని డా. కవ్వంపల్లి సత్యనారాయణ ఆశాభావం వ్యక్తం చేశారు. తనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని మనీషా విష్ణు తెలిపారు.

## కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం నుండి డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టండి

**సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**అతి త్వరలో సంయుక్త సమావేశం..**



పటాన్చెరు : నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాలన్న లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో కొల్లూరు, ఉస్మాన్ నగర్, నాగులపల్లి ప్రాంతాలలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి కేటాయించడం జరిగిందని.. గత కొంతకాలంగా అసాంఘిక శక్తులకు, మత్తు పదార్థాలకు కేంద్రాలుగా తయారవుతున్నాయని.. వెంటనే చర్యలు చేపట్టడంతో పాటు మత్తు పదార్థాల వినియోగం వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డికి పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

బుధవారం గచ్చిబౌలిలోని సిపి కార్యాలయంలో కమిషనర్ రమేష్ రెడ్డిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా నియోజకవర్గ పరిధిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గల డివిజన్లలో గత కొంతకాలంగా మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా యువతతో పాటు విద్యార్థులు, పేద, మధ్యతరగతి ప్రజలు మత్తు పదార్థాలకు బానిసై.. అనారోగ్యానికి గురై ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో అత్యధిక శాతం అత్యంత నిరుపేదలు జీవనం కొనసాగిస్తున్నారని.. మత్తు పదార్థాల వినియోగం మూలంగా కుటుంబాలు రోడ్డున పడటంతో శాంతిభద్రతలు అదుపు తప్పుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంలో వెంటనే చర్యలు చేపట్టకపోతే తీవ్ర పరిణామాలు ఉత్పన్నమయ్యే పరిస్థితి ఏర్పడబోతున్నాయని సిపి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన సిపి రమేష్ రెడ్డి.. అతి త్వరలో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయడంతో పాటు డ్రగ్స్ వాడకం మూలంగా ఎదురయ్యే పరిణామాలను ప్రజలకు స్వయంగా వివరించడం జరుగుతుందని తెలిపారు. నిరంతరం నిఘా పెట్టడంతో పాటు దుష్పరిణామాలపై వివిధ మాధ్యమాల ద్వారా అవగాహన కల్పిస్తామని తెలిపారు.



## పటాన్‌చెరు నియోజకవర్గంలో ఘనంగా మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు

పటాన్ చెరు (వాయిస్ టుడే) : తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, శాసనసభ ఉపనేత తన్నీరు హరీష్ రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరు నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వి.ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో అమీన్‌పూర్‌లోని ది నెస్ట్ హోమ్ ఫర్ ఏజ్డ్ వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ రావు ప్రజాసేవలను కొనియాడుతూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో పటాన్‌చెరు నియోజకవర్గంలోని శివనగర్ పరిధిలో ఉన్న శిరీష మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్లో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్ అమీన్‌పూర్‌లోని మహిమ మినిస్ట్రీస్ అనాథాశ్రమంలో విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి పంపిణీ చేసి, కేక్ కట్ చేసి హరీష్ రావు జన్మదిన వేడుకలను నిర్వహించారు.అంతకుముందు కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అమీన్‌పూర్ మాజీ చైర్మన్ పాండురంగ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇంచార్జ్ రవి కిరణ్, ఉపేందర్ రెడ్డి, జగదీశ్వర్, బిజిలిపురం రాజు, తలారి రాములు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీధర్ చారి పృథ్వీరాజ్ , విజయ్,తదితరులు పాల్గొన్నారు.



## హరీష్ రావు జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించిన కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ నిజాముద్దీన్ బాబా

పటాన్ చెరు (వాయిస్ టుడే ) : తెలంగాణ రాష్ట్ర ప్రజల హృదయాలలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు హరీష్ రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఇస్నాపూర్ మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ నిజాముద్దీన్ బాబా ఆధ్వర్యంలో మున్సిపాలిటి పరిధిలోని తేజ కాలనిలో గల ఆశ్రయ వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులకు బియ్యం, పప్పులు, నూనె, చక్కెర, టీ పొడి, సబ్బులు మరియు ఇతర నిత్యావసర కిరాణా సరుకులను పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులతో కొంత సమయం గడిపి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా నిజాముద్దీన్ బాబా మాట్లాడుతూ, ప్రజా సేవకు ప్రతీకగా నిలిచిన హరీష్ రావు జన్మదినాన్ని సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సమాజంలో వృద్ధులు అమూల్యమైన ఆస్తి అని, వారి పట్ల గౌరవం మరియు బాధ్యత ప్రతి ఒక్కరిలో ఉండాలని పేర్కొన్నారు. పుట్టినరోజులు, ప్రత్యేక సందర్భాలను కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నిజమైన ఆనందం లభిస్తుందని తెలిపారు. హరీష్ రావు గారు ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమాన్ని కోరుకుంటూ, సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చారని, వారి స్ఫూర్తితోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. భవిష్యత్తులో కూడా పేదలు, వృద్ధులు, అనాథలు మరియు అవసరమైన వారికి సహాయ సహకారాలు అందించే కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులు మరియు నిర్వాహకులు ఈ సహాయానికి హర్షం వ్యక్తం చేస్తూ నిజాముద్దీన్ బాబాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

# నైపుణ్యాభివృద్ధికి గీతం పెద్దపీట

**అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో విద్యార్థులకు మార్గనిర్దేశం**



పటాన్ చెరు (వాయిస్ టుడే ) : వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగంలో విద్యార్థులకు స్పష్టత, దిశానిర్దేశం అందించే లక్ష్యంతో, గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్, శిక్షణ, మార్గదర్శనం, వృత్తిపరమైన సలహాలు (టీఎంసీజీ) డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విద్యార్థులు పరిశ్రమకు సంబంధించిన నైపుణ్యాలను, కెరీర్ మార్గాలను నిర్మించుకోవడంలో సహాయపడటానికి రూపొందించిన సమగ్ర కెరీర్ మార్గ సూచీల శ్రేణిని ప్రవేశపెట్టారు. నేటి విద్యార్థులకు అపారమైన ఆశయాలు ఉన్నప్పటికీ, అభివృద్ధి చెందుతున్న అనేక రంగాలలో సరైన వృత్తి మార్గాన్ని ఎంచుకోవడంలో వారు తరచుగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని టీఎంసీజీ నిపుణులు గుర్తించారు. దానిని అధిగమించేలా, ప్రాథమిక అభ్యాసం నుంచి పరిశ్రమకు సిద్ధమయ్యే వరకు విద్యార్థుల ప్రయాణాన్ని సులభతరం చేసే నిర్మాణాత్మక అభ్యాస మార్గాలను వారు అభివృద్ధి చేశారు.

కృత్రిమ మేధ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, సాఫ్ట్ వేర్ ఇంజనీరింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, బ్లాక్ చెయిన్, వీఎల్ఎస్ఐ వంటి మరెన్నో సాంకేతికతలు అభివృద్ధి చెందడంతో, విద్యార్థులు తమ వృత్తి ప్రయాణాన్ని ఎక్కడ, ఎలా ప్రారంభించాలో గుర్తించడంలో తరచుగా తడబడుతున్నారు. ఈ అవసరాన్ని తీరుస్తూ, కొత్తగా ప్రారంభించిన మార్గ సూచీలు వృత్తి నిపుణులు కావాలనుకునే వారికి స్పష్టమైన, ఆచరణాత్మకమైక అభ్యాస మార్గాన్ని అందిస్తున్నాయి. సాంకేతికేతర కెరీర్ రంగాలతో సహా, మరిన్ని అదనపు మార్గ సూచీలు కూడా ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్నాయి. ఈ కార్యక్రమం గురించి డాక్టర్ రోజీనా మాథ్యూ మాట్లాడుతూ, టెక్నాలజీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, వృత్తిపరమైన విజయానికి నిరంతర అభ్యాసం అత్యవసరమని స్పష్టీకరించారు. తాము రూపొందించిన మార్గదర్శకాలు విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో, ఒక లక్ష్యంతో, నిర్మాణాత్మక మార్గదర్శనంతో అభివృద్ధి చెందుతున్న రంగాలను అన్వేషించంలో సహాయపడటానికి ఉద్దేశించినట్టు తెలియజేశారు.

'ఏమి నేర్చుకోవాలి, ఎప్పుడు నేర్చుకోవాలి, ప్రాథమిక స్థాయి భావనల నుంచి పరిశ్రమకు సిద్ధంగా ఉన్న నిపుణులుగా ఎలా ఎదగాలి అనే విషయాలను విద్యార్థులు అర్థం చేసుకోవడంలో సహాయపడటానికి ఈ మార్గ సూచీలను రూపొందించాం. ఒక విద్యార్థి ఒక రంగాన్ని మొదటిసారి అన్వేషిస్తున్నా లేదా నైపుణ్యాలను పెంచుకునే తదుపరి దశకు ప్రణాళిక వేస్తున్నా, ఈ వనరులు ఒక విలువైన ప్రారంభ బిందువుగా ఉపయోగపడతాయి' అని డాక్టర్ రోజీనా వివరించారు. పరిశ్రమ పోకడలు, సాంకేతిక పురోగతులకు అనుగుణంగా నిరంతరం అధునాతనను సంతరించుకునే సజీవ పత్రాలుగా ఈ మార్గ సూచీలను రూపొందించారు. భవిష్యత్ అభ్యాసకులకు ఈ వనరులు ప్రయోజనకరంగా ఉండేలా చూసేందుకు, లేదా మెరుగుదల కోసం సూచనలు తెలియజేయమని విద్యార్థులను అధ్యాపకులు ప్రోత్సహిస్తున్నారు. నైపుణ్యాభివృద్ధి దిశగా చురుకైన చర్యలు తీసుకోవాలని విద్యార్థులను ప్రోత్సహిస్తూ, 'ప్రారంభించడానికి ఉత్తమ సమయం నిన్న. రెండవ ఉత్తమ సమయం ఇప్పుడే' అని వారు ప్రేరేపిస్తున్నారు. విద్యార్థులకు ఆచరణాత్మక మార్గదర్శనం, మెంటార్ షిప్, క్రమబద్ధమైన కెరీర్ అభివృద్ధి వనరులను అందించడం ద్వారా, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న నిపుణులను తీర్చిదిద్దడంలో గీతం యొక్క నిరంతర నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తోంది. 'అన్వేషించండి, నేర్చుకోండి, నిర్మించండి, ఎదగండి' అనేది ఈ పరివర్తనాత్మక కార్యక్రమానికి మార్గదర్శక సందేశంగా ఈ వినూత్న కార్యక్రమం నిలుస్తుంది.



## ప్రజానాయకుడు మాజీ మంత్రి సిద్దిపేట్ శాసనసభ్యులు హరీష్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్

పటాన్ చెరు (వాయిస్ టుడే ) : మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు జన్మదినోత్సవం సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మరియు ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కీసరలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి తో కలిసి పాల్గొన్న పృథ్వీరాజ్ ,హరీష్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో కొత్త ప్రభాకర్ రెడ్డి,చింత ప్రభాకర్, హరీష్ రావు అభిమానులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బి ఆర్ ఎస్ అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజల కోసం నిరంతరం శ్రమించే నాయకుడు హరీష్ అన్న... మీ సేవలు మరెన్నో సంవత్సరాలు కొనసాగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
గురువారం 4 జూన్ 2026



## శ్రీ గణేష్ గడ్డ సిద్ది గణపతి దేవస్థానంలో నేడు సంకష్టహర చతుర్దశి పురస్కరించుకొని సిద్ధి గణపతి కి ప్రత్యేక పూజలు

పటాన్ చెరు (వాయిస్ టుడే) : పటాన్ చెరు నియోజకవర్గ ఇస్నాపూర్ మున్సిపాలిటీ శ్రీ గణేష్ గడ్డ సిద్ది గణపతి దేవస్థానంలో నేడు సంకష్టహర చతుర్దశి పురస్కరించుకొని ఉదయం విశేష పంచామృత అభిషేకము సింధూర వర్ణంతో ప్రత్యేక దర్శనమిస్తున్న సిద్ధి గణపతి అనంతరం మధ్యాహ్నం నిత్య అన్నదాన కార్యక్రమం మరియు సాయంత్రం శ్రీ గణపతి వ్రతం తదుపరి భజన సంకీర్తన భక్తిశ్రద్ధలతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు చైర్మన్ మరియు కమిటీ సభ్యులు, ఈ కార్యక్రమాలు ఆలయ అర్చకులు, సిబ్బంది, చైర్మన్ హరి ప్రసాద్ రెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు గ్రామ పెద్దలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.




## కేసీఆర్ వెన్నంటే నిజమైన గులాబీ సైనికుడు హరీష్‌రావు

**పార్టీని ముందుకు నడిపించే ట్రబుల్ షూటర్**

**మాజీ ప్రభుత్వ ఛీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**

**హనుమకొండలో ఘనంగా హరీశ్ రావు జన్మదిన వేడుకలు**

హనుమకొండ,వాయిస్ టుడే: కేసీఆర్ వెన్నంటి నిబద్ధతతో నడిచిన నిజమైన గులాబీ సైనికుడు మాజీ మంత్రి హరీష్ రావు అని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్,మాజీ శాసనసభ్యులు,హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. మాజీ మంత్రి,బీఆర్ఎస్ పార్టీ శాసనసభ ఉపపక్ష నేత,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను బుధవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వినయ్ భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు కేక్ కట్ చేసి హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ఉద్యమం నుంచి పార్టీ బలోపేతం వరకు ప్రతి దశలోనూ హరీష్ రావు కీలక పాత్ర పోషించారని అన్నారు. పార్టీకి వెన్నెముకగా నిలుస్తూ,కార్యకర్తల కోసం నిరంతరం శ్రమించే నాయకుడు హరీష్ రావు అని కొనియాడారు. క్లిష్ట పరిస్థితుల్లో పార్టీని ముందుకు నడిపించే ట్రబుల్ షూటర్‌గా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని చెప్పారు. హరీష్ రావు జన్మదినాన్ని రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని,ఆయన ఆశయాల సాధనకు కార్యకర్తలు మరింత కృషి చేయాలని దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు వద్దిరాజ్ గణేష్,జోరిక రమేష్, సీనియర్ నాయకులు పులి రజినీకాంత్, నయీముద్దీన్, కమురున్నీసా బేగం,నాయకులు శ్రీధర్, రామ్మూర్తి, జుబేర్, రాజు, కోటేశ్వరరావు, రఘు, శ్రీనివాస్, విక్రమ్,వినోద్,సుధాకర్,సదాంత్,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## కాజీపేటలో ఘనంగా హరీష్ రావు జన్మదిన వేడుకలు

కాజీపేట,వాయిస్ టుడే: మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను కాజీపేట చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ అర్బన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నార్లగిరి రమేష్,47వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ సంకు నర్సింగరావు హాజరై కేక్ కట్ చేసి హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరీష్ రావు నిజమైన గులాబీ సైనికుడని,భారత రాష్ట్ర సమితి పార్టీకి వెన్నెముకగా నిలిచిన ట్రబుల్ షూటర్ అని కొనియాడారు. క్రమశిక్షణ,నిబద్ధతకు మారుపేరైన హరీష్ రావును ఆదర్శంగా తీసుకుని కార్యకర్తలు భవిష్యత్తులో మంచి రాజకీయ నాయకులుగా ఎదగాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు హరీష్ రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 62వ డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల శివకుమార్,శిరుమల్ల దశరథం,ఎం.డి అఫ్జల్,పాలడుగుల రామస్వామి, ఎం.డి మహమూద్,సుంచు అశోక్,దువ్వ నరేష్,గబ్బెట కరుణ్ (సిద్దు),మర్యాల కృష్ణ, ఎం.డి మతీన్,తండమల్ల వేణు,అన్నంపెల్లి రాజ్‌కుమార్,మంద రాజ్‌కుమార్,కొంతం మల్లేష్, పడిదెల శేఖర్,బండి రాంచందర్,శృంగారపు బిషపతి,మాచర్ల ప్రభాకర్, నర్సింహాచారి,పోతుల సాంబయ్య,గాజుల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవ నుంచి రాజకీయ సేవ వైపు..

**జనసేనలో చేరిన డాక్టర్ గడల శ్రీనివాసరావు... తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం**

హైదరాబాద్, జూన్ 3: (వాయిస్ టుడే) : తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ మాజీ డైరెక్టర్, ప్రముఖ ప్రజారోగ్య నిపుణుడు డాక్టర్ గడల శ్రీనివాసరావు జనసేన పార్టీలో చేరారు. బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నివాసంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు పార్టీ కండువా కప్పి జనసేన కుటుంబంలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, ప్రజాసేవను జీవిత ధ్యేయంగా భావించిన డాక్టర్ గడల శ్రీనివాసరావు వంటి వ్యక్తులు రాజకీయాల్లోకి రావడం సమాజానికి ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వ వైద్యుడిగా ప్రారంభమైన ఆయన ప్రస్థానం ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ స్థాయికి చేరుకోవడం ఆయన కృషి, నిబద్ధత, పరిపాలనా సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.



ప్రత్యేకించి కరోనా మహమ్మారి సమయంలో తెలంగాణ ప్రజలకు సరైన వైద్య సేవలు, అవగాహన కార్యక్రమాలు అందించడంలో డాక్టర్ గడల శ్రీనివాసరావు పోషించిన పాత్రను పవన్ కళ్యాణ్ గుర్తు చేశారు. సంక్షోభ సమయంలో ప్రజల్లో ధైర్యం నింపడంతో పాటు ఆరోగ్య శాఖ యంత్రాంగాన్ని సమర్థవంతంగా నడిపించిన అధికారిగా ఆయన గుర్తింపు పొందారని కొనియాడారు. ప్రజారోగ్యం, విద్య, యువత ఉపాధి, మహిళా సాధికారత వంటి అంశాలపై డాక్టర్ గడలకు ఉన్న అవగాహన పార్టీకి ఉపయోగపడుతుందని, తెలంగాణలో జనసేన పార్టీ విస్తరణకు ఆయన సేవలు కీలకమవుతాయని పవన్ కళ్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం డాక్టర్ గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాజకీయాలు అధికార సాధన కోసం కాకుండా సమాజ సేవ కోసం ఉండాలని తాను విశ్వసిస్తానన్నారు. ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను అర్థం చేసుకుని పరిష్కార మార్గాలు చూపాలనే ఉద్దేశంతోనే జనసేనలో చేరినట్లు తెలిపారు.

పవన్ కళ్యాణ్ వ్యక్తిత్వం, నిజాయితీ, దేశభక్తి, ప్రజా సమస్యలపై ఆయన చూపుతున్న చిత్తశుద్ధి తనను ఆకర్షించాయని పేర్కొన్నారు. సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేస్తున్న జనసేన పార్టీ తన ఆలోచనలకు దగ్గరగా ఉందని చెప్పారు. తెలంగాణలో యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని, విలువలతో కూడిన రాజకీయాలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, మహిళల భద్రత వంటి అంశాలపై ప్రత్యేకంగా పనిచేయాలనే సంకల్పంతో ఉన్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ప్రజారోగ్య రంగంలో తన అనుభవాన్ని ప్రజల సంక్షేమానికి ఉపయోగిస్తానని, ప్రభుత్వ సేవలో ఉన్నప్పుడు ఎలా అంకితభావంతో పనిచేశానో రాజకీయ జీవితంలో కూడా అదే నిబద్ధతతో ముందుకు సాగుతానని స్పష్టం చేశారు.

తన సేవా కాలంలో సహకరించిన వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు, ప్రజారోగ్య శాఖ సిబ్బంది, తెలంగాణ ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో తెలంగాణ అభ్యున్నతి కోసం పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వైద్య రంగ ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు, అభిమానులు పాల్గొని డాక్టర్ గడల శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతానికి ఆయన చేరిక కొత్త ఊపు తీసుకువస్తుందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడ్డాయి.



## మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**మహిళల ఆర్థిక సాధికారతకు మరో ముందడుగు**

**మడికొండలో మహిళల పెట్రోల్ బంక్‌కు శంకుస్థాపన**

**పాల్గొన్న కలెక్టర్,ఎంపీ, కుడా ఛైర్మన్,ప్రజాప్రతినిధులు**

హనుమకొండ,వాయిస్ టుడే: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రత్యేక కార్యాచరణతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు తెలిపారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా బుధవారం హనుమకొండ జిల్లా మడికొండ మహిళా ప్రాంగణంలో మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న పెట్రోల్ బంక్‌కు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య,జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్,కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి మరియు అధికారులతో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడంతో పాటు మహిళల పేరుమీద అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే మహిళా సంఘాలకు అధిక మొత్తంలో వడ్డీలేని రుణాలను అందిస్తున్నామని వెల్లడించారు. ఉచిత బస్సు ప్రయాణంపై కొందరు విమర్శలు చేసినప్పటికీ..మహిళలను కేవలం ప్రయాణికులుగానే కాకుండా ఆర్టీసీ వ్యవస్థలో భాగస్వాములు,యజమానులుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని పేర్కొన్నారు. మడికొండలో మహిళల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు కావడం సంతోషకరమని,మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని సూచించారు. మహిళలు విద్యావంతులు,ఆర్థికంగా స్వావలంబులు అయినప్పుడే కుటుంబం,సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్న ఎమ్మెల్యే మహిళల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి మహిళలు అండగా నిలవాలని ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,అధికారులు,స్థానికులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న మూడవ విడత దోస్త్ అడ్మిషన్లు

ఖమ్మం , జూన్ 3 ( వాయిస్ టుడే ): డిగ్రీ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు సంబంధించిన దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియ మూడవ దశ కొనసాగుతున్నదని ఖమ్మం ఎస్ఆర్ బిజి ఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.రిజిస్ట్రేషన్లకు ఈనెల 15 చివర తేదీ కావడంతో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వెబ్ ఆప్షన్ల కు 16 వరకు అవకాశం ఉందని వెల్లడించారు.ఇంతకు ముందు రెండు విడతల్లో నమోదు చేసుకోలేని విద్యార్థులు మూడవ విడత లో చేసుకోవచ్చన్నారు కాగా రెండవ విడత లో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 5 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు.విద్యార్థులుఈసదావకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఇతరవివరాలకుకళాశాల దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్లో సంప్రదించాలని తెలిపారు.




## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పాట ఆవిష్కరణ

బోయినపల్లి జూన్ 3 (వాయిస్ టుడే ప్రతినిధి) : ఈ నెల 5న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జన్మదినము సందర్భంగా బోయినపల్లి మండల యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు నాగుల వంశీ గౌడ్ ఎమ్మెల్యే పై ప్రత్యేక పాటను రూపొందించారు. ఈ మేరకు కరీంనగర్లోని ఎమ్మెల్యే నివాసంలో బుధవారం పాటను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రజల కష్టసుఖాల్లో తోడుగానిలుస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని దేవుళ్లను వేడుకొంటూ ప్రత్యేక గీతాన్ని రూపొందించినట్లు వంశీ గౌడ్ తెలిపారు. ఎమ్మెల్యే నాయకత్వంలో మండల అభివృద్ధికి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సువిన్ యాదవ్ నాయకులు సుధాకర్ భాస్కర్, శాలివాహన శ్రీనివాస్, అనిల్ దేవయ్య ఉన్నారు.

# అధ్యాపకులలో చిరకాల స్వప్నం సహకారం

ఖమ్మం , జూన్ 3 ( వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రేకనింగ్ ఆఫ్ సర్వీస్ జీవో నెంబర్ 21 పట్ల తెలంగాణ కళాశాల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా సంఘం హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరిపింది. సందర్భంగా స్థానిక ఎస్ ఆర్ బి జి ఎన్ ఆర్ ప్రభుత్వ కళాశాల నందు జిల్లాలోని అధ్యాపకులందరూ సంబరాలు నిర్వహించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యంగా జీవో విడుదలకు సహకరించిన ముఖ్యమంత్రివర్యులు అనుముల రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్కకి, తెలంగాణ విద్యాశాఖ అధికారిణి శ్రీమతి యోగితారాణా, కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీమతి దేవసేనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ జీవోను సాధించుటలో అత్యంత కీలకమైన మరియు ముఖ్యపాత్ర పోషించిన TGCGTA ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నంద్రు గోపి గారి నాయకత్వాన్ని సమర్థిస్తూ వారు చేసిన కృషికి అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నంద్రు గోపి మాట్లాడుతూ అధ్యాపకుల చిరకాల స్వప్నమైన రేకనింగ్



సర్వీస్ జీవో సాధించడం పట్ల అసోసియేషన్ నిబద్ధతను గుర్తు చేశారు అధ్యాపకుల న్యాయమైన సమస్యల పరిష్కారంలో అసోసియేషన్ అధ్యాపకులకు అండగా ఉంటుందని తమపై నమ్మకం ఉంచిన సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు డాక్టర్ సురేందర్ రెడ్డి నాయకత్వాన్ని కళాశాల అధ్యాపకలు పూర్తి మద్దతును ప్రకటించారు, తమకు సహకరించిన ముఖ్యమంత్రివర్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కళాశాల కమిషనర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు డాక్టర్ ఎన్ మాధవరావు, రాష్ట్ర బాధ్యులు డాక్టర్ వి శాంత కుమార్, జిల్లా బాధ్యులు డాక్టర్ కిరణ్ కుమార్, సూరంపల్లి రాంబాబు డాక్టర్ పి విజయకుమార్, డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్, డాక్టర్ బూరుగు శ్రీనివాస్, డాక్టర్ వెంకన్న, డాక్టర్ శ్రీనివాస్ కుమార్, డాక్టర్ శ్యామ్, డాక్టర్ కార్తీక్, డాక్టర్ జి వెంకయ్య, డాక్టర్ పగిడిపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ కవిత, డాక్టర్ మాధవి డాక్టర్ బిందు శ్రీ , డాక్టర్ శ్యామల, డాక్టర్ శ్రీరామ్ రాకేష్ బి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.






# ఎంజీఎం సమస్యల పరిష్కారానికి అభివృద్ధి కమిటీ సమీక్ష

**ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడమే ఎంజీఎం వైద్యుల బాధ్యత**

**వైద్యులు, సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి**

**ఎంజీఎం,సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల అభివృద్ధికి కృషి చేస్తాం**

**ఎంజీఎం ఆసుపత్రి సమీక్ష సమావేశంలో మంత్రి కొండా సురేఖ, ఎం.పీ కావ్య,ఎమ్మెల్యే నాగరాజు**

హనుమకొండ,వాయిస్ టుడే: జిల్లా కలెక్టర్,ఎంజీఎం అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ సత్యశారద అధ్యక్షతన బుధవారం జరిగిన ఎంజీఎం అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు,మౌలిక సదుపాయాలు,మానవ వనరులు,వైద్య పరికరాల అవసరాలు,నర్సింగ్ పాఠశాల,వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ,దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ,వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య,వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి,హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తదితరులు హాజరయ్యారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య,నర్సింగ్ పోస్టులు,అత్యవసర విభాగంలో రద్దీ,వైద్య పరికరాల కొరత,పెండింగ్ బిల్లులు తదితర సమస్యలను అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన నిధులు,పరికరాల సమీకరణకు చర్యలు తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడంలో వైద్యులు కీలక పాత్ర పోషించాలని మంత్రి సురేఖ పేర్కొన్నారు.

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ఉత్తర తెలంగాణకు ఆరోగ్య భరోసాగా నిలుస్తున్న ఎంజీఎం ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసేందుకు సమిష్టి కృషి అవసరమన్నారు. వైద్యులు,సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ పాటించాలని,బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ఎంజీఎం ఆసుపత్రి మరియు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు నైపుణ్యం కలిగిన వైద్యులను నియమించాలని సూచించారు. హనుమకొండ,వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయి, డాక్టర్ సత్యశారద లు మాట్లాడుతూ ఎంజీఎం ఆసుపత్రిలో మౌలిక వసతులు, సిబ్బంది,పరిపాలనా అంశాలపై తరచూ సమీక్షలు నిర్వహిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరిచంద్రారెడ్డి,అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.




## జిల్లా సైకిల్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవం

కరీంనగర్, జూన్ 03(వాయిస్ టుడే): ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా జిల్లా సైకిల్ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ నుండి ఎలగంధల్ ఖిల్లా వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అటవీ అధికారి సత్యనారాయణ,కరీంనగర్ రేంజ్ సిబ్బంది, జిల్లా సైకిల్ సంఘం బాధ్యులు మధుసూదన్ రెడ్, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఈనెల 5న కరీంనగర్‌లో టీపీసీసీ చీఫ్,మంత్రుల పర్యటన

**పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు**

**పార్టీ శ్రేణులు హాజరయ్యి విజయవంత్ చేయండి: మేడిపల్లి సత్యం**

కరీంనగర్, జూన్ 03(వాయిస్ టుడే): ఈ నెల 5వ తేదీన కరీంనగర్ నగరంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు,శంకుస్థాపనలకు టీపీసీసీ అధ్యక్షులు,ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్,రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్,అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరుకానున్నారని చొప్పదండి ఎమ్మెల్యే,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం గారు ఒక ప్రకటనలో తెలిపారు.సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమాల్లో సుడా నిధులతో రాజీవ్ చౌక్ సుందరీకరణ పనుల ప్రారంభం,స్వర్గీయ రాజీవ్ గాంధీ నూతన కాంస్య విగ్రహ ఆవిష్కరణ,పాత మున్సిపల్ గెస్ట్ హౌస్ ప్రారంభోత్సవం,నూతన ఫుడ్ కోర్టులకు శంకుస్థాపన కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

## పొన్నం.. తెలంగాణ నీ అయ్యా జాగీరు కాదు

**పవన్ కళ్యాణ్ పై మతిభ్రమించి మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్.**

**జనసేన కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ బేతి మహేందర్ రెడ్డి ఫైర్.**




కరీంనగర్, జూన్ 03(వాయిస్ టుడే): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు "జనసేన పార్టీ సాధక్" లతో నవ నిర్మాణ సభకు వచ్చి దిశ నిర్దేశం జనసైనికులకు చేసేందుకు పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ హైదరాబాద్ కు రావడాన్ని జీర్ణించుకోలేని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మతిభ్రమించి మాట్లాడుతూ తెలంగాణ నీ అయ్యా జాగీరు కాదని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని,అదే విధంగా పొన్నం ప్రభాకర్ తెలంగాణ కూడా నీ అయ్యా జాగీరు కాదని జనసేన పార్టీ కరీంనగర్ పార్లమెంటు కో-ఆర్డినేటర్ బేతి మహేందర్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు.కరీంనగర్ లో పోటీ చేసేందుకు ఎన్నికలకు భయపడి ఇతర జిల్లాకు పారిపోయి అక్కడ ఇతర పార్టీల నాయకులతో చాటుమాటు ఒప్పందాలు చేసుకొని దొంగదారిలో గెలిచిన నువ్వు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పై మాట్లాడడం సిగ్గుచేటని బేతి మహేందర్ రెడ్డి మండిపడ్డారు. పొన్నం ప్రభాకర్ నోటి దూలతో కరీంనగర్ లో జీరో అయిన కూడా ఇంకా తగిన బుద్ధి రాలేదని,ఈ నోటి దూల వలన తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరానికి చేటుగా మారిందని, పొన్నం ప్రభాకర్ వ్యవహార శైలి ఇలాగే కొనసాగితే మాత్రం రాబోయే ఎన్నికల్లో ఎక్కడ పోటీ చేసిన డిపాజిట్ గల్లంతవ్వడం ఖాయమని, ఇప్పటికైనా మీ పద్ధతి మార్చుకోకపోతే తెలంగాణ ప్రజలు మిమ్మల్ని ఉరికించి కొడతారని బేతి మహేందర్ రెడ్డి హెచ్చరించారు.

# ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా.. ఆహ్లాదం పెంచేలా

# వేములవాడ బండ్ పార్క్ అభివృద్ధి

**భక్తులకు కనువిందు చేసేలా, ప్రత్యేక ఆకర్షణగా 40 ఫీట్ల మహాశివుడి విగ్రహం, సప్తమాత్రికల విగ్రహాలు.**

**త్వరలో అందుబాటులోకి బోటింగ్ సదుపాయం.**

**రాజన్న పుణ్య క్షేత్రానికి మరింత శోభ.. పర్యాటక రంగానికి ఊతం.**





వేములవాడ, జూన్ -03 (వాయిస్ టుడే): దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ పుణ్య క్షేత్ర ఆధ్యాత్మిక శోభ మరింత వెల్లివిరిసేలా గుడి చెరువు బండ్ పార్క్ పై మహాశివుడి విగ్రహం, సప్తమాత్రికల విగ్రహాల ఏర్పాటు పూర్తి అయింది. వేములవాడ గుడి చెరువు బండ్ పార్కును భక్తి భావం పెంచేలా.. ఆహ్లాదం ఆనందాన్ని పంచేలా వీటీఏడీఏ (వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ) ఆధ్వర్యంలో అందంగా తీర్చిదిద్దుతున్నారు. వేములవాడ దేవస్థానానికి సమీపం లో ఉన్న ఈ బండ్ పార్క్ ను పట్టణ ప్రజలు, ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడం తో పాటు, సుందరీకరణ పనులు చేపడుతున్నారు. గుడి చెరువు అభివృద్ధి పనులను గత ఆరు నెలల క్రితం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రణాళిక ప్రకారం చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు ఆధ్యాత్మికత భావం ఉట్టిపడేలా, భక్తి భావం పెంపొందించేలా మహాశివుడి విగ్రహంతో పాటు, సప్తమాత్రికల విగ్రహాలు, అలాగే గుడి చెరువులో బోటింగ్ సదుపాయం ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆలోచన, ఆదేశాల మేరకు పర్యాటక శాఖ అధికారులు బండ్ పార్క్ లో 40 ఫీట్ల ఎత్తైన మహాశివుడి విగ్రహం, సప్తమాత్రికల విగ్రహాలు ఏర్పాటు చేశారు. గుడి చెరువులో బోటింగ్ సదుపాయం అందుబాటు లోకి తీసుకువచ్చేందుకు టెండర్ దశలో ఉన్నాయి. వేగంగా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి బోటింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేసేందుకు పర్యాటక శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. బోటింగ్ సదుపాయం అందుబాటు లోకి వస్తే కుటుంబాలతో వచ్చే భక్తులు, పర్యాటకులకు మరింత వినోదాన్ని అందించడంతో పాటు వేములవాడలో పర్యాటక రంగ అభివృద్ధికి కూడా దోహదపడనుంది. బండ్ పార్క్ లో శివుని విగ్రహం, సప్తమాత్రికల విగ్రహాల ఏర్పాటు, బోటింగ్ సదుపాయం, ఇతర అభివృద్ధి పనులపై పట్టణ ప్రజలు సానుకూల స్పందన వ్యక్తం చేస్తున్నారు.తుది దశకు చేరుకున్న బండ్ పార్క్ మిగతా అభివృద్ధి పనులను పూర్తి చేసి, బోటింగ్ సదుపాయం అందుబాటులోకి తీసుకువచ్చి త్వరగా ప్రారంభానికి సిద్ధం చేసేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం వేములవాడ పట్టణంలోని గుడి చెరువు బండ్ పార్క్ ను క్షేత్ర స్థాయిలో సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. నేమ్ బోర్డు, టాయిలెట్లు, ఎవెన్యూ ప్లాంటేషన్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పనులు పూర్తి చేసి త్వరలో ప్రారంభానికి సన్నాహాలు చేయాలని సూచించారు.

## తీరనున్న కరీంనగర్ వాసుల కష్టాలు

**కరీంనగర్ జగిత్యాల జాతీయ రహదారికి లైన్ క్లియర్ కేంద్రం గ్రీన్ సిగ్నల్**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషితోనే కరీంనగర్ జగిత్యాల నేషనల్ హైవే**

**పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు**



కరీంనగర్, జూన్ 03(వాయిస్ టుడే): కరీంనగర్ జగిత్యాల జాతీయ రహదారికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం అతిపెద్ద తీపి కబురు అందించింది.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో జగిత్యాల కరీంనగర్ జాతీయ రహదారిని (ఎన్ హెచ్ 563) 4 వరుసలుగా (4-లైన్లు గా) విస్తరించేందుకు కేంద్ర క్యాబినెట్ అధికారికంగా ఆమోదం తెలిపింది. కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు కరీంనగర్ జగిత్యాల నేషనల్ హైవే నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రవీణ్ రావు మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ జగిత్యాల నేషనల్ హైవే నిర్మాణం చేపట్టడం కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు.బండి సంజయ్ కృషితోనే నేడు కరీంనగర్ జగిత్యాల జాతీయ రహదారి సాకారం అవుతుందన్నారు. ప్రధానంగా తెలంగాణలోని రెండు ప్రధాన రహదారుల విస్తరణకు (ఆర్మూర్ జగిత్యాల-మంచిర్యాల మరియు జగిత్యాల-కరీంనగర్) కలిపి మొత్తం రూ. 7,597.16 కోట్లను కేంద్రం కేటాయించిందని తెలిపారు. ఇందులో కేవలం జగిత్యాల-కరీంనగర్ సెక్షన్ కోసమే రూ. 2,395 కోట్లు ఖర్చు చేయనున్నారని తెలిపారు. దాదాపు 58 కిలోమీటర్ల పొడవుతో జగిత్యాల కరీంనగర్ సెక్షన్‌ను (బిఓటి) పద్ధతిలో విస్తరించనున్నారని తెలిపారు.ఇందులో భారీ ట్రాఫిక్ ఉండే జనాభా ప్రాంతాలను తప్పిస్తూ కొత్తగా 34.96 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్లు కూడా నిర్మించనున్నారని,ఈ హైవేపై వాహనాలు గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా డిజైన్ చేస్తున్నారనీ తెలిపారు. ముఖ్యంగా ఈ 4 లేన్ల రోడ్డు అందుబాటులోకి వస్తే జగిత్యాల కరీంనగర్ మధ్య ప్రయాణ సమయం దాదాపు 45 నిమిషాల పాటు కలిసి వస్తుందని,ఈ హైవే విస్తరణ వల్ల జగిత్యాల,పోతారం, గంగాధర,కరీంనగర్ పరిసరప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు పూర్తిగా తొలిగిపోనున్నాయన్నారు.ఈ ప్రాజెక్ట్ పీఎం గతి శక్తి కిందరూపుదిద్దుకోవడం వల్ల కరీంనగర్, జగిత్యాల జిల్లాల సామాజిక,ఆర్థికాభివృద్ధికి,ముఖ్యంగా స్థానిక వ్యాపారాలకు, రైతులకు తమ ఉత్పత్తులను రవాణా చేయడానికి ఎంతో మేలు చేకూరనుందన్నారు.

## తడగొండలో ఘనంగా పోచమ్మ బోనాలు



బోయినపల్లి జూన్ 3 (వాయిస్ టుడే ప్రతినిధి) : బోయినపల్లి మండలం తడగొండలో పోచమ్మ బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. డబ్బు చప్పుళ్లు, బైండ్ల వాయిద్యాల నడుమ ఆడపడుచులు ఇంటింటా అమ్మవారికి బోనం తీసి ఊరేగింపుగా వెళ్లి ఆలయం వద్ద సమర్పించారు. అనంతరం మొక్కలు చెల్లించుకున్నారు. వేడుకలో సంఘం సర్పంచ్, ఉప సర్పంచ్ ,వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్లు, మాజీ ఉప సర్పంచ్, డైరెక్టర్లు నాయకులు, గ్రామస్తులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## వృక్షానికి అంటుకున్న నిప్పు

**ఫైర్ ఇంజన్‌తో మంటలు అర్పిన సిబ్బంది.. తప్పిన ప్రమాదం**

బోయినపల్లి జూన్ 3 (వాయిస్ టుడే ప్రతినిధి) : బోయిన్‌పల్లి నుండి తడగొండ వెళ్లే దారిలో చెట్టుకు మంటలు చెలరేగడం తో విషయం తెలుసుకున్న వెంటనే లిసర్పంచ్ నల్ల మోహన్‌లి స్పందించి, ఎవరికీ ఇబ్బంది కలగకుండా ఫైర్ ఇంజన్‌ను సంఘటన స్థలానికి రప్పించి మంటలను అదుపులోకి తెప్పించారు. అనంతరం ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చెట్టును తొలగించే పనులు చేపట్టారు. ప్రజల భద్రత కోసం వెంటనే స్పందించి చర్యలు తీసుకున్న సర్పంచ్ కు గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు

## ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ సమావేశానికి హాజరైన కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ మేయర్ కోలగాని శ్రీనివాస్‌కు ఉత్తరాఖండ్ సీఎం అభినందనలు**



కరీంనగర్, జూన్ 03(వాయిస్ టుడే): ఉత్తరాఖండ్ రాష్ట్రం ఋషికేశ్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117వ సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ను ఈ సందర్భంగా అభినందించి,శుభాకాంక్షలు తెలియజేశారు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం ప్రప్రదంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఇటీవల బిజెపి ఘన విజయం సాధించిన నేపథ్యంలో, మేయర్ గా అతి పిన్న వయసు కలిగిన కోలగని శ్రీనివాస్ నియామకం కావడం పట్ల సీఎం పుష్కర్ సింగ్ ధామి సంతోషం వ్యక్తం చేశారు. మేయర్ కోలగాని శ్రీనివాస్ ఈ సందర్భంగా ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామికి కృతజ్ఞతలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. సమావేశాలకు అతిథులుగా హాజరైన ఉత్తరాఖండ్ రాష్ట్ర మంత్రులు సుబోధ్ ఉన్నియాల్, ప్రేమ్ చంద్ర అగర్వాల్,మదన్ కౌశిక్,లోకసభ సభ్యులు (హరిద్వార్)త్రివేంద్ర సింగ్ రావత్,రాజ్యసభ సభ్యులు మహేంద్ర భట్,డా.ప్రేమ్ చంద్ర అగర్వాల్ (ఎమ్మెల్యే,ఋషికేశ్ నియోజకవర్గం)లను మేయర్ కోలగని శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
గురువారం 4 జూన్ 2026

# ద్వితీయ శ్రేణి నగరాల్లో కోట్లాది రూపాయలతో నిర్మించిన ఐటీ టవర్లు నిరుపయోగం



## విద్యారంభానికి అక్షరాభ్యసమే తొలి అడుగు

**ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ**

తిమ్మాపూర్, జూన్ 03(వాయిస్ టుడే): పిల్లల విద్యారంభానికి అక్షరాభ్యసమే తొలి మెట్టు అని మానకొండూర్ ఎమ్మెల్యే,టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన అనంతరం నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలచేత అక్షరాలు దిద్దించి వారిని ఆశీర్వదించారు.అనంతరం డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పిల్లల జీవితంలో అక్షరాభ్యసమే కీలకమన్నారు. ప్రతి చిన్నారి భవిష్యత్తుకు అక్షరాభ్యసమే బలమైన పునాది అని అన్నారు.చిన్నారులు చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు.చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం,ప్రాథమిక విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.అందులో భాగంగానే నూతన భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.పిల్లలకు మెరుగైన వసతులు,సురక్షితమైన వాతావరణంలో విద్యా,పోషకాహార సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని,విద్య,వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు.అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు,బాలింతలు,చిన్నారులకు అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని,ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమాధికారి ఎం.సరస్వతి, ఐసీడీఎస్ అధికారులు,అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు,మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## 49వ డివిజన్‌లో చీరల పంపిణి చేసిన కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్

కరీంనగర్, జూన్ 03(వాయిస్ టుడే): నగరపాలక సంస్థ49 డివిజన్ కార్పొరేటర్ అన్నం లక్ష్మీ ప్రకాష్ చేతుల మీదుగా మన సనాతన ధర్మం సేవా సమితి డివిజన్ కార్యాలయం వద్ద మహిళలకు చీరల పంపిణి చేశారు.49వ డివిజన్లో ఓటు హక్కు,ఆధార్ కార్డు రేషన్ కార్డు ఉండి దారిద్ర రేఖకు దిగువన ఉన్న అర్హులైన పేదవారికి ప్రతి ఒక్కరికి చీరలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్,ఆర్ పి గాయత్రి,వార్డ్ ఆఫీసర్ మెండే శిరీష,డివిజన్ ప్రజలు విజయలక్ష్మి శారద,మమత, కవిత,సులోచన,సౌజన్య,స్వరూప, లావణ్య,బిజెపి కార్యకర్తలు లంబు సుధాకర్ రెడ్డి,గాదగోని రమేష్, భూమ్ రావు,నల్మచు సంతోష్,ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.



## సుభాష్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'బడిబాట' కార్యక్రమం

**ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య**

**కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్**

కరీంనగర్, జూన్ 03(వాయిస్ టుడే): ప్రభుత్వ ఆదేశాల మేరకు 'బడిబాట' కార్యక్రమంలో భాగంగా సుభాష్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వార్డు సభ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 26వ డివిజన్ కార్పొరేటర్,కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోంది. అత్యంత అర్హత కలిగిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నారు.ప్రభుత్వ పాఠశాలల పట్ల ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత స్టూడెంట్ కిట్లు,ఉచిత యూనిఫామ్‌లు, అల్పాహారం,మధ్యాహ్న భోజనం, ఉచిత టెక్స్ట్ బుక్స్,నోట్ బుక్స్ అందజేస్తున్నాం.కావున తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి అని పిలుపునిచ్చారు.అనంతరం ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో 'బడిబాట' ప్రతిజ్ఞ చేయించారు.ఈ బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల నమోదును పెంచడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్‌లో భాగంగా ఈ ఏడాది చివరి నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 100 కొత్త పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటు చేయనున్నారు.ఈ కార్యక్రమంలో 25వ డివిజన్ కార్పొరేటర్ గంట శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు రవీందర్, ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ కృష్ణమాచారి,డివిజన్‌లోని ఆర్‌పీలు, అంగన్‌వాడీ టీచర్లు,మహిళా సంఘం నాయకులు,పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

**కరీంనగర్ ఐటీ టవర్‌లో ఉద్యోగాలు ఎక్కడ**

**స్థానిక యువతకు ఉపాధి కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం**

**డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేష్ పటేల్**




కరీంనగర్, జూన్ 03(వాయిస్ టుడే): జిల్లాలోని ఐటీ టవర్‌ను స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించే కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరుతూ డీవైఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఐటీ టవర్ ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేష్ పటేల్ మాట్లాడుతూ కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన కరీంనగర్ ఐటీ టవర్ ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రభుత్వాలు హామీలు ఇచ్చాయని,కానీ నేటికీ ఆ హామీలు అమలు కాలేదని విమర్శించారు. కరీంనగర్ జిల్లాతో పాటు ఉమ్మడి జిల్లాలకు చెందిన వేలాది మంది యువత ఇంజనీరింగ్,డిగ్రీ,పీజీ,ఇతర వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసినప్పటికీ ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.యువతకు ఉద్యోగాలు కల్పించాల్సిన ఐటీ టవర్ నేడు ఆశించిన స్థాయిలో కంపెనీలు లేక నిరుపయోగంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఐటీ టవర్‌లో కార్యకలాపాలు నిర్వహించిన పలు సంస్థలు వెళ్లిపోవడం,ఖాళీగా ఉన్న కార్యాలయ స్థలాల్లో కొత్త కంపెనీలను తీసుకురావడంలో ప్రభుత్వం విఫలమవడం వల్ల స్థానిక యువత ఉద్యోగ అవకాశాలను కోల్పోయిందన్నారు. యువత హైదరాబాద్, బెంగళూరు, పుణే, చెన్నై వంటి నగరాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌కే పరిమితమైన ఐటీ అభివృద్ధి విధానాన్ని మార్చి జిల్లా కేంద్రాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.కరీంనగర్ ఐటీ టవర్‌లో వెంటనే కొత్త కంపెనీలను ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న కార్యాలయ స్థలాలను వినియోగంలోకి తీసుకురావాలని, స్థానిక యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించాలని,ఐటీ మరియు ఇతర రంగాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు.జిల్లాలో నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక ఉపాధి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వం ఐటీ మంత్రి శ్రీధర్ బాబు వెంటనే స్పందించి కరీంనగర్ ఐటీ టవర్‌ను ఉద్యోగాల కేంద్రంగా మార్చి స్థానిక యువతకు న్యాయం చేయాలని ఆయన కోరారు.లేనిపక్షంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శివ కుమార్ జిల్లా నాయకులుఅజేయ్, సాయి,నరేందర్,రాహుల్,దినేష్,నాగరాజు పాల్గొన్నారు

## మోడల్ స్కూల్లో 2026-2027 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభం



కరీంనగర్ రూరల్, జూన్ (వాయిస్ టుడే): 2026-2027 విద్యా సంవత్సరానికి గాను ఎలగందల్ మోడల్ పాఠశాలలో 6 వ తరగతి మరియు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి.వీటికి సంబంధించిన సెలక్షన్ లిస్ట్ పాఠశాల ఆవరణలో ఉంచడం జరిగిందని, సెలెక్ట్ అయిన స్టూడెంట్స్ ఈనెల 20 వ తేదీ లోపు కావలసిన సర్టిఫికెట్స్ సమర్పించి,అడ్మిషన్ తీసుకోవాలని , పూర్తి వివరాలకు స్కూల్లో సంప్రదించాలని ప్రిన్సిపల్ కొడిమ్యాల శ్రీనివాస్ కోరారు.

## మహిళలను గౌరవించేందుకే చీరల పంపిణీ

**మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ**



కరీంనగర్, జూన్ 03(వాయిస్ టుడే): నిరుపేద,మధ్య తరగతి మహిళలను గౌరవించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నదని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు.కరీంనగర్ నగర పాలక సంస్థ 8వ డివిజన్ పరిధిలోని అల్గునూరులో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి మహిళలకు అందజేస్తున్న ఇందిరమ్మ చీరలు మహిళల పట్ల ప్రభుత్వానికి ఉన్న గౌరవం,చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.గత ప్రభుత్వంలో ఇచ్చిన చీరలు మహిళలు కట్టుకోకుండా పంటచేల వద్ద బెదురు కోసం వాడారని ఆయన గుర్తు చేశారు. మహిళలందరూ ఇందిరమ్మ చీరలు కట్టుకునే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంచి రంగు,డిజైన్తో చీరలు తయారు చేయించి పంపిణీ చేయిస్తున్నారని ఆయన చెప్పారు.మహిళా సంఘాలకు మాత్రమే ఇందిరమ్మ చీరలు ఇస్తున్నామనే ప్రచారం అవాస్తవమని, అర్హులైన మహిళలందరికీ చీరలు పంపిణీ చేస్తున్నామని ఆయన వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అలగనూరుకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఉప కమిషనర్ వేణుమాధవ్,8వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మనవేణి రమేశ్,పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి,కంది లక్ష్మీనారాయణ రెడ్డి,కంది పెద్ద అశోక్ రెడ్డి,కంది చిన్న అశోక్ రెడ్డి,తొర్తి అరవింద్,పి మనోహర్,జాప రత్నాకర్ రెడ్డి,సింగం రమేష్,బుర్ర లక్ష్మణ్, కుంభాల లింగయ్య, బుర్ర కనకయ్య కార్పొరేషన్ సిబ్బంది మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.



## వైద్య సిబ్బందిపై దాడులను అరికట్టాలి

**తెలంగాణ చౌక్‌లో హెచ్ఏఎఫ్ నిరసన**

**రాజస్థాన్ ఘటనను తీవ్రంగా ఖండించిన హాస్పిటల్స్ యాక్షన్ ఫోర్స్**

**హెచ్ఏఎఫ్ కరీంనగర్ అధ్యక్షుడు డాక్టర్ మహేష్ రెడ్డి**

కరీంనగర్ (వాయిస్ టుడే) : రాజస్థాన్‌లోని ఒక ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, నర్సులు, ఇతర ఆరోగ్య సిబ్బందిపై జరిగిన దాడిని హాస్పిటల్స్ యాక్షన్ ఫోర్స్ (హెచ్ఏఎఫ్) కరీంనగర్ యూనిట్ తీవ్రంగా ఖండించింది. ఆరోగ్య సేవలందిస్తున్న సిబ్బందిపై జరుగుతున్న దాడులు ఆందోళనకరమని, ఇవి ఆరోగ్య వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతాయని హెచ్ఏఎఫ్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు నిరసనగా బుధవారం కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఏఎఫ్ కరీంనగర్ అధ్యక్షుడు డాక్టర్ మహేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేష్ కుమార్ చౌదరి, మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తున్న వైద్య సిబ్బందిపై దాడులు జరగడం అత్యంత బాధాకరమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు సేవలందించే సమయంలో సిబ్బంది అనేక ఒత్తిళ్లు, సవాళ్లను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఒక వైద్యుడిపై దాడి అంటే మొత్తం ఆరోగ్య వ్యవస్థపై దాడి చేసినట్టేనని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటువంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిందితులపై వేగవంతమైన విచారణ జరిపి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది భద్రత కోసం ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని, హింసను అరికట్టేందుకు ఉన్న చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ చౌక్‌లో జరిగే నిరసనలో వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ఆసుపత్రి ఉద్యోగులతో పాటు ఆరోగ్య రంగానికి చెందిన ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో పాల్గొని ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమం లో కోశాధికారి డాక్టర్ శ్రవణ్ కుమార్, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఆర్. వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి డాక్టర్ వి. ప్రశాంత్‌తో పాటు కార్యవర్గ సభ్యులు డాక్టర్ సుమన్, డాక్టర్ రాజా విజయేందర్ రెడ్డి, డాక్టర్ నరేందర్, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ రాజ్‌కుమార్ జాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య విగ్రహ ఏర్పాటు పనులు పర్యవేక్షణ



కరీంనగర్, జూన్ 03(వాయిస్ టుడే): పట్టణం ముఖ ద్వారం అల్గునూరు బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేయనున్న దొడ్డి కొమురయ్య విగ్రహ పనులను సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్ పర్యవేక్షించారు.



## ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చి దిద్దేందుకు వ్యాపారస్థులు సహకరించాలి

**వ్యాపార సముదాయాలకు నోటీసుల అందజేసిన కార్యదర్శి అనిల్**

బోయినపల్లి జూన్ 3 (వాయిస్ టుడే ప్రతినిధి) : ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చి దిద్దేందుకు వ్యాపారస్థులు సహకరించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని కార్యదర్శి అనిల్ అన్నారు.బుధవారం బోయినపల్లి గ్రామం లోని చికెన్ సెంటర్,హోటల్,మెడికల్ షాప్,కిరాణా షాపులు,వివిధ షాపుల యజమానులకు నోటీసులు అందజేశారు. గ్రామం లో వాడి పడేసే వస్తువులు నిషేధించాలని అన్నారు.ప్రతి షాపు లో తడి చెత్త,పొడి చెత్త ను గ్రామ పంచాయతీ ట్రాక్టర్ కి ఇవ్వాలని, నాప్కిన్ లు,సూదులు,సిరంజీలు,బ్లేడ్ లు,వాడిన పట్టీలు,కాటన్,శానిటరీ వస్తువులు సురక్షితంగా పేపర్ లో చిట్టి పంచాయతీ ట్రాక్టర్ సిబ్బంది కి ఇవ్వాలని తెలిపారు.విస్తరాకులు,టీ కప్పులు డ్రైనేజ్ లు వేయరాదని,బల్బులు,బ్యాటరీలు,కాలం చెల్లిన మందులు,మాంసపు వ్యర్థాలను,ఈకలను బహిరంగ ప్రదేశాల్లో వేయరాదని నోటీసులో సూచించారు. ఇట్టి నిబంధనను అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేసి జరిమానా విధిస్తామని అన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**

# స్పోర్ట్స్ ఆఫ్ అథారిటీ ఆఫ్ ఇండియాకి ఎంపికైన విద్యార్థిని

## ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గత మూడు దశాబ్దాలలో ఇదే మొదటిసారి

## పలువురు ప్రముఖుల అభినందనలు

## ఘనంగా సన్మానించిన మంత్రి అడ్లూరీ లక్ష్మణ్ కుమార్

## మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన విస్డం పాఠశాల యజమాన్యం



రాయికల్, జూన్ 3:వాయిస్ టుడే : జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రానికి చెందిన విస్డం పాఠశాల లో చదువుతున్న చిదుమల్ల సాన్విక అనే విద్యార్థిని హైదరాబాద్ గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ ఆఫ్ అథారిటీ ఆఫ్ ఇండియా (క్రీడా పాఠశాల)కు ఎంపికైంది.. గత మూడు దశాబ్దాల కాలంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఇదే మొదటిసారి కావడం గమనార్హం... ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కరీంనగర్ జగిత్యాల లాంటి పట్టణాలలో అన్ని రకాల వసతులు ఉన్నా కూడా గత మూడు దశాబ్దాల కాలంలో ఏ పాఠశాల విద్యార్థి కూడా ఈ ఎంపిక కాలేకపోవడం ఒకింత బాధ కలిగించే విషయం.. కానీ సాన్విక ఈ ఘనత సాధించడం పట్ల విస్డం పాఠశాల కరస్పాండెంట్ రాజిరెడ్డి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పాఠశాల నుంచి విద్యార్థులను క్రీడారంగంలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన విధంగా శిక్షణ ఇస్తున్నామని. ఈరోజు అందుకు తగిన ప్రతిఫలం లభించిందని హర్షం వ్యక్తం చేశారు. సాన్విక మొదటి నుండి క్రీడలలో చురుకుగా పాల్గొంటుందని అది గుర్తించి ఆమెపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి శిక్షణ ఇచ్చామని ఆమెకే కాకుండా పాఠశాలలో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి క్రీడలలోని ప్రాథమిక అంశాల నుండి వారి లోపాలను సరిదిద్దుతూ శిక్షణ కొనసాగుతుందన్నారు.

చదువులలో విద్యార్థులు రాణించాలంటే వారు క్రీడల పట్ల కూడా అవగాహన కలిగి ఉండాలి.మేము చదువుతో పాటు క్రీడలపై కూడా విద్యార్థులను ప్రోత్సహిస్తాం.. క్రీడల ద్వారా శారీరక మరియు మానసిక ప్రశాంతత నెలకొంటుంది.. ఆత్మవిశ్వాసంతో విద్యార్థులు ముందుకు సాగుతారు.. కేవలం క్రీడలనే కాకుండా విద్యార్థులు ఏ ఏ రంగాలలో తమ నైపుణ్యాన్ని చూపిస్తారో వాటిలో వారికి శిక్షణ ఇస్తాం అన్నారు.

### మంత్రి చేతుల మీదుగా సన్మానం అందుకోవడం ఆనందంగా ఉంది...

ఇలా ఉండగా గత మూడు దశాబ్దాల కాలంలో మొదటిసారిగా క్రీడా పాఠశాలకు ఎంపికైన తమ పాఠశాల విద్యార్థిని సాన్వికను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరీ లక్ష్మణ్ కుమార్ సన్మానించడం పట్ల విస్డం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ ఏ.ఎమ్ .రాజు రెడ్డి మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.





# జడ్చర్లలో నోవోస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

మహబూబ్నగర్ జిల్లా జూన్ 3 (వాయిస్ టుడే) : జడ్చర్ల టౌన్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన నోవస్ మల్టీ స్పెషాలిటీ క్లినిక్ ను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ అనిరుధ్ రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ లు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు రిబ్బన్ కట్ చేసి క్లినిక్‌ను ప్రారంభించి, అక్కడ ఏర్పాటు చేసిన వైద్య సదుపాయాలను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన మరియు ఆధునిక వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో నోవస్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్డియాలజీ, డెర్మటాలజీ తదితర విభాగాల్లో ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, ఆధునిక పరికరాలు మరియు అనుభవజ్ఞులైన వైద్యుల సేవలతో రోగులకు మెరుగైన వైద్యం అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్య సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో ఇటువంటి వైద్య సంస్థలు ప్రజలకు ఎంతో ఉపయోగపడ తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫీజు రియంబర్స్ మెంట్ నిధులు ఎందుకు విడుదల చేయడం లేదు

## సంక్షేమ పథకాలకు వేల కోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వానికి ఫీజు రియంబర్స్ మెంట్ కు నిధులు లేవా

హుజూర్ నగర్, జూన్, 03 (వాయిస్ టుడే ప్రతినిధి): పేద విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ నిధులు లేవా అని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ధూళిపాళ శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. బుధవారం సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ ఆర్డీవో శ్రీనివాసులు కు ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ హక్కుల సాధన సమితి మరియు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. సంక్షేమ పథకాలకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసే రాష్ట్ర ప్రభుత్వానికి పేద మధ్యతరగతి విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడం దారుణమని రాష్ట్రంలోని బీసీ హక్కుల సాధన సమితి మరియు బీసీ సంక్షేమ సంఘం తో పాటు అనేక బీసీ ఉద్యమ సంఘాలు ప్రభుత్వాన్ని అనేక విధాలుగా కోరినప్పటికీ ప్రభుత్వ స్పందన లేకపోవడం విచారకరమని గతంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలతో చర్చించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారే తప్ప అమలు చేయలేకపోయారని ఇప్పటికే రాష్ట్రంలో అనేక కాలేజీలు మూతపడ్డాయని మరికొన్ని కాలేజీలో మూతపడే ప్రమాదం అంచున ఉన్నాయని ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులే ఎవరి ఫీజులు వారు భరించాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందని తద్వారా పేద మధ్యతరగతి వర్గాల విద్యార్థులు చదువుకు దూరం అయ్యే ప్రమాదం ఉన్నదని ఇది రాష్ట్ర ప్రభుత్వానికి అంగీకారమేనా అని వారు ప్రశ్నించారుఎన్నికల సందర్భంగా విద్యార్థినులకు ఉచిత ఎలక్ట్రిక్ స్కూటీలు అందిస్తామని, ఫీజు రియంబర్స్మెంట్ నిధులు బకాయిలు లేకుండా చేస్తామని విద్యను ప్రోత్సహిస్తామని ఎన్నో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి ఇవాళ ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల కాలేజీలు మూతపడే పరిస్థితి దాపురించిందని ఇందుకు ముఖ్యమంత్రిగా నే కాకుండా విద్యాశాఖ మంత్రిగా కూడా బాధ్యతలు వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నైతిక బాధ్యత వహించాలని వారు అన్నారు.



# ఘనంగా మాజీ మంత్రి హరీష్‌రావు జన్మదిన వేడుకలు

నర్సాపూర్ వాయిస్ టుడే : నియోజకవర్గం లో హత్నూర మండల్ పరిధిలోని దౌల్తాబాద్ తెలంగాణ తల్లిచౌరస్తా వద్ద బుధవారం నాడు మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు బి ఆర్ ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.హరీష్ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని కేకు కట్ కట్ చేశారు బి ఆర్ ఎస్ నాయకులు హరీష్ రావు లాంగ్ లీవ్,హరీష్ రావు లాంగ్ లీవ్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ టపాకాయలు పేల్చి తమ నాయకుడు మాజీ మంత్రి హరీష్ రావు లాంటి ట్రిబుల్ షూటర్ లీడర్ తెలంగాణలో లేరని నినాదాలు చేశారు. హత్నూర మండల్ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రామచంద్ర రెడ్డి మాజీ ఎంపీపీ నర్సింలు నాయకులు సంగారెడ్డి జిల్లా కార్మిక విభాగమ అధ్యక్షులు శివ శంకర్ రావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆషా జ్యోతి,పేదల పెన్నిధి,రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మనసున్న మారాజు మాజీ మంత్రి హరీష్ రావు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్ళు చల్లగా ఉండాలని ఆ భగవంతుని కోరారు.ఈకార్యక్రమంలో దౌల్తాబాద్ ఉప సర్పంచ్ పటేల్ శేఖర్ గౌడ్ హత్నూర మండల్ బిఆర్ఎస్ యువత అధ్యక్షులు తుమ్మలపల్లి కిషోర్, హత్నూర మండల్ మాజీ బిఆర్ఎస్ యువత అధ్యక్షులు ఏల్చల మధు పటేల్ నస్తీపూర్ గ్రామ ఉపసర్ప మహేందర్ పటేల్ సంగారెడ్డి జిల్లా కార్మిక విభాగము ఉపాధ్యక్షులు అంబటి అర్జున్ దౌల్తాబాద్ పట్టణ అధ్యక్షుడు అజ్మత్ అలీ అజ్జు,సిరిపురం మాజీ సర్పంచ్ మచ్చ దేవులపల్లి సర్పంచ్ మల్లేశం నరేందర్,మాజీ సర్పంచ్ మల్లారెడ్డి కోపరేట్ సొసైటీ డైరెక్టర్ కృష్ణ,మాజీ ఎంపీ టి సి ఆగమయ్య పటేల్ కిషన్ గౌడ్ శంకర్,రాము, తదితరులు పాల్గొన్నారు.

# 4న మక్తల్‌కు ముఖ్యమంత్రి రాక

## ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి వాకిటి శ్రీహరి



మక్తల్ జూన్ 3 వాయిస్ టుడే ప్రతినిధి : నారాయణ పేట జిల్లా మక్తల్ నియోజక వర్గ పరిధిలో కృష్ణా, భీమానది మీద రెండు బ్యారేజీల నిర్మాణం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే చేయడానికి ఈ నెల 4న మక్తల్ కు విచ్చేయున్న సందర్భంగా సోమవారం సాయంత్రం జిల్లా మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్ తో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. మక్తల్ గురుకుల పాఠశాల సమీపంలో సీఎం హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు.

ఈ నెల 3 న కర్ణాటక ముఖ్యమంత్రి డీ. కే. శివ కుమార్ ప్రమాణ స్వీకారానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరై, మరుసటి రోజు 4న కర్ణాటక నుంచి హెలికాప్టర్ లో నేరుగా మక్తల్ కు చేరుకుని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తో కలిసి కృష్ణా, భీమా నది పై నిర్మించే రెండు బ్యారేజీల నిర్మాణం కోసం ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. అనంతరం సీఎం మళ్ళీ మక్తల్ కు చేరుకుని నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొననున్నారు.

# సంగారెడ్డి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి మరో మేలు రాయి

## ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



నర్సాపూర్ (వాయిస్ టుడే) : నియోజకవర్గంలోని హత్నూర మండల పరిధిలోని బోరపట్ల గ్రామ శివారులో

తెరానిమ్ బయోలాజిక్స్ యూనిట్ ప్రారంభం ద్వారా తెలంగాణ బయోఫార్మా రంగంలో మరో కీలక ముందడుగు పడిందని, రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఇది నూతన ఊతాన్ని అందిస్తుందని మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో హత్నూర మండలం బోరపట్ల శివారులో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన తెరానిమ్ బయోలాజిక్స్ (TheraNym Biologics) తయారీ యూనిట్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం, పారదర్శక విధానాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందుబాటులో ఉండటంతో ప్రపంచ స్థాయి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని తెలిపారు.బయోటెక్నాలజీ, ఔషధ రంగాల్లో తెలంగాణ ఇప్పటికే దేశంలో అగ్రగామిగా నిలిచిందని, ఔషధ రంగంలో ఆధునిక సాంకేతికతతో కూడిన తెరానిమ్ బయోలాజిక్స్ వంటి సంస్థల రాకతో రాష్ట్రం అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు పొందుతుందని పేర్కొన్నారు. ఈ సంస్థ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కూడా దోహదం చేస్తుందని అన్నారు.

మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ అత్యాధునిక బయోలాజికల్ ఔషధాల తయారీలో ఈ యూనిట్ కీలక పాత్ర పోషించనుందని చెప్పారు. వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలు, పరిశోధనలకు ఇలాంటి సంస్థలు బలాన్ని చేకూరుస్తాయని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా ఔషధ, బయోటెక్నాలజీ రంగాలకు ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందని, పరిశ్రమల విస్తరణతో పాటు స్థానిక ప్రజల జీవనోపాధి అవకాశాలు కూడా గణనీయంగా మెరుగుపడతాయని తెలిపారు. పరిశ్రమలు అభివృద్ధి చెందడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించాలని సంస్థలకు సూచించారు. ఈ కార్యక్రమంలో టి జి ఐ ఐ సి చైర్ పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి, సంస్థ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ కలెక్టర్ పాండు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో మూడు నాలుగు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి

## ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం



గంగాధర్, జూన్ 03(వాయిస్ టుడే): నియోజక వర్గం పరిధిలో వరి ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తి కావచ్చాయని,మూడు నాలుగు రోజుల్లో ధాన్యం పూర్తవుతాయని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం అన్నారు.చొప్పదండి నియోజక వర్గం గంగాధర మండలం నాగిరెడ్డి పూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించన ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం మాట్లాడుతూ నియోజక వర్గ రైతుల సహకారంతో 90 శాతం ధాన్యం కొనుగోలు చేసినట్లు మరో మూడు నాలుగు రోజులలో పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని మాట ఇస్తూ ప్రతి పక్షాలు ఎన్ని అబద్ధపు ప్రచారాలు చేసిన ప్రజా ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని మరోసారి నిరూపణ అయింది అని ఎవరు ఎంత బురద చల్లిన మనం ఎప్పుడు రైతుల పక్షనే ఉంటామని హామీ ఇచ్చారు.

# ఆల్ఫోర్స్ నుండి ఐఐటీలోకి జగిత్యాల వాసి ఐఐటీ శిక్షణకు కోర్సుకు ఎంపిక అయినా సాందరి కారి లహరి



ధర్మపురి, జూన్ 03 (వాయిస్ టుడే) : జగిత్యాల జిల్లాలోని జగిత్యాల పట్టణ కేంద్రంలో గల స్థానిక ఆల్ఫోర్స్ బాలికల జూనియర్ కళాశాల యందు ఇంటర్మీడియట్ విద్యాను అభ్యాసించిన సాందరి కారి లహరి అనే విద్యార్థిని ఐఐటీలో ఎస్సీ విభాగం 362 ర్యాంకుతో ప్రీపరేటరీ క్రింద 2026 - 2027 విద్యా సంవత్సరం నందు ఏడాది పాటు ఏదైనా ఒక ఐఐటీలో శిక్షణ ఇచ్చి 2027 - 2028 విద్యా సంవత్సరం యందు బీటెక్ కళాశాల లలో ప్రవేశం కల్పిస్తారని ఆల్ఫోర్స్ కళాశాల ప్రిన్సిపాల్ పాలకుర్తి రజని బుధవారం రోజు మధ్యాహ్నం వేళలో మీడియాతో మాట్లాడుతూ.. ఇట్టి శిక్షణ ద్వారా జేఈఈ మెయిన్స్ నందు అర్హత సాధించి ఐఐటీలు, ఇతర విద్యా సంస్థ లలో సీట్లు సాధిస్తారు అని వారు మీడియాతో పేర్కొన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐఐటీ, తెలంగాణ ఏప్ సెట్, ఇతర పోటీ పరీక్షలలో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సాందరి కారి లహరితో పాటు ఆమె తల్లిదండ్రులు అయినా ఉమా సురేష్ - దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆల్ఫోర్స్ విద్యా సంస్థల నుండి తమ అభినందనలను తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో వారితో పాటు, కళాశాల భోదన సిబ్బంది, కళాశాల సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయం

## నియోజకవర్గ అధ్యక్షులు వి. వెంకటేశ్వర రెడ్డి



నాగార్జునసాగర్ జూన్ 3 (వాయిస్ టుడే) : టీయూడబ్ల్యూజే (ఐజేయు) నల్గొండ జిల్లా స్థాయి మహాసభ బుధవారం నకిరేకల్ పట్టణంలో రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు హాజరై సంఘ బలోపేతం, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. మహాసభలో భాగంగా నూతన జిల్లా కమిటీలను ప్రకటించారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్ నియోజకవర్గ అధ్యక్షులుగా వడ్లపల్లి వెంకటేశ్వర రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జర్నలిస్టు వర్గాల్లో ఆయనకు ఉన్న విశ్వాసం, సేవా భావానికి ఈ ఎన్నిక నిదర్శనంగా భావిస్తున్నారు. ఈ సందర్భంగా వడ్లపల్లి వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. నియోజకవర్గస్థాయి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వారి వృత్తి భద్రత, సంక్షేమం, గుర్తింపు, ప్రభుత్వ పరంగా రావలసిన సౌకర్యాల సాధన కోసం సంఘం తరఫున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.జర్నలిస్టుల ఐక్యతే సంఘ బలమని పేర్కొన్న ఆయన, ప్రతి జర్నలిస్టు సమస్యను తన సమస్యగా భావించి స్పందిస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణతో పాటు యువ జర్నలిస్టులకు ప్రోత్సాహం, వృత్తిపరమైన శిక్షణ, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన టీయూడబ్ల్యూజే రాష్ట్ర, జిల్లా నాయకత్వంతో పాటు కార్యవర్గ సభ్యులు, జిల్లా జర్నలిస్టులకు వడ్లపల్లి వెంకటేశ్వర రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# టియుడబ్ల్యూ జె - ఐజేయు నాగార్జునసాగర్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

## అధ్యక్షులు పాకాల నరసింహ, ప్రధాన కార్యదర్శి టీకే ప్రకాష్

నాగార్జునసాగర్,జూన్ 3 (వాయిస్ టుడే): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ నాగార్జునసాగర్ పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం నకరికల్ లో నిర్వహించిన జిల్లా మహాసభల సందర్భంగా జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి అధ్యక్షతన నూతన కార్యవర్గ ఎన్నిక ప్రక్రియ జరిగింది,నాగార్జున సాగర్ పట్టణ గౌరవ అధ్యక్షులు గా శ్రీనివాస్ రెడ్డి,వెంకటేశ్వర రెడ్డిలు,అధ్యక్షులుగా పాకాల నర్సింహా,ప్రధాన కార్యదర్శి, టి.కె.ప్రకాష్,కోశాధికారి భూపతి రవీందర్, ఉపాధ్యక్షులు గా కోడా అప్పారావు,యాళ్ల విజయ్,సహాయ కార్యదర్శులుగా యెబు రాజు,శివరాం ప్రసాద్,ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన జిల్లా నాయకత్వానికి,తోటి జర్నలిస్ట్ మిత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాగార్జునసాగర్ పరిధిలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి,వారి సంక్షేమానికి నిరంతరం అందుబాటులో ఉంటూ కమిటీని మరింత బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు,